ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ **కోనసీమ** జిల్లా వార్తలు
శుక్రవారం 13 డిసెంబరు 2024 | 5

గగనంలో చలో చలో ఢిల్లీకి..



ప్రొటోకాల్‌లో భాగంగా తొలి విమాన సర్వీసుపై వాటర్‌ను వెదజల్లుతూ స్వాగతిస్తున్న దృశ్యం



రాజమహేంద్రవరం నుంచి ఢిల్లీకి ఇండిగో తొలి విమాన సర్వీసుకు మొదటి టిక్కెట్టును కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కుమారుడు సంజీవ్‌కు అందిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎంపీలు, ఎమ్మెల్యేలు

రాజమహేంద్రవరం నుంచి ఢిల్లీకి విమానం
ప్రారంభమైన ఇండిగో ఫ్లైట్ సర్వీసులు
విమాన సర్వీసును ప్రారంభించిన
కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి

ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న రాజమహేంద్రవరం నుంచి ఢిల్లీకి విమాన సర్వీసులు గురువారం ప్రారంభమయ్యాయి. మధురపూడిలో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు ఈ సర్వీసులను ప్రారంభించగా.. ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఈనెల ఒకటిన ముంబైకి సర్వీసులు ప్రారంభమైన సంగతి తెలిసిందే.. - 6లో

విజిలెన్స్, మోనటరింగ్ కమిటీ సమావేశం వాయిదా

అమలాపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంలో ఈ నెల 13న నిర్వహించ తలపెట్టిన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సమావేశం వాయిదా వేసినట్టు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకురాలు పి.జ్యోతిలక్ష్మీదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13న విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర ప్రగతికి మూలమైన స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ కార్యక్రమం ఉన్నందున మోనటరింగ్ కమిటీ సమావేశం వాయిదా వేసినట్లు చెప్పారు. కమిటీ సమావేశం తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే తెలియచేస్తామన్నారు.



అమరావతిలో గురువారం జరిగిన రెండో రోజు కలెక్టర్లు, ఎస్పీల కాన్ఫరెన్స్‌కు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ కృష్ణారావు హాజరయ్యారు. వివిధ అంశాలపై జరిగిన చర్చలో వారు పాల్గొన్నారు..

నేతలు చేసిన మోసం

●(మండపేట)

- ప్రభుత్వ అనుమతులు లేకుండా వైసీపీ హయాంలో ఇళ్ల నిర్మాణం
- నేతలు చెప్పారన్న ధైర్యంతో అప్పులు చేసి పూర్తిచేసిన వైనం
- గృహనిర్మాణ శాఖ లెక్కల్లో లేని ఇళ్లు...బిల్లులు రాక లబోదిబో



గత వైసీపీ ప్రభుత్వంలో నేతలు గృహ నిర్మాణదారులను మోసం చేశారు. 'మేమున్నాం...మీకెందుకు..ఇళ్లు నిర్మించుకోండి..అంతా మేము చూసుకుంటాం' అని అప్పట్లో భరోసా ఇవ్వడంతో గృహ నిర్మాణ దారులు ముందుకు వచ్చి ఇళ్లు నిర్మించుకున్నారు. గృహ నిర్మాణ శాఖ అనుమతులు లేకుండానే ముందుకెళ్లారు. అయితే ఇప్పుడు అదే లబ్ధిదారుల పాలిట శాపంగా మారింది. అలా నిర్మించుకున్న ఒక్కదానికి కూడా బిల్లులు మంజూరు కాలేదు. బిల్లుల కోసం ఇప్పుడు లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. గృహ నిర్మాణ శాఖలో ప్రభుత్వ అనుమతులు లేకుండానే కేవలం నేతల ఆదేశాల మేరకు మండపేట నియోజకవర్గంలో జగనన్న ఇళ్ల పేరిట నిర్మించుకున్న గృహాల వివరాలు ఇప్పుడు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదు. దీంతో గందరగోళం ఏర్పడింది. అప్పులు చేసి మరీ ఇళ్లు కట్టుకున్న వారు ఇప్పుడు తలలు పట్టుకుంటున్నారు. ఏమి చేయాలో పాలుపోక అయోమయానికి గురవుతున్నారు.

మండపేట నియోజకవర్గంలో లబోదిబో

మండపేట నియోజకవర్గంలో 2021-22 సంవత్సరంలో నియోజకవర్గ పరిధిలో గల రాయవరం మండలంలో 372 మంది, కపిలేశ్వరపురం మండలంలో 746 మంది లబ్ధిదారులు ఎటువంటి అనుమతులు లేకుండానే ఇళ్లను నిర్మించుకున్నారు. రాయవరం మండలంలో 372 మంది, జగనన్న లేఅవుట్‌లో 94 మంది, సొంత స్థలాలు కలిగిన వారు 278, కపిలేశ్వరపురం మండలంలో 746, జగనన్న లేఅవుట్‌లో 186 మంది, సొంత స్థలాల్లో నిర్మించుకున్న లబ్ధిదారులు 560 మంది ఉన్నారు. వీటికి సంబంధించిన లబ్ధిదారుల జాబితా వైసీపీ ప్రభుత్వంలో ప్రస్తుత శాసనమండలి సభ్యుడు, మండపేట నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి తోట త్రిమూర్తులు ప్రభుత్వానికి అందించారు. కానీ నేటి వరకు ఆ జాబితాకు గృహనిర్మాణ శాఖ అనుమతులు లేవు. అలాగే ఆన్‌లైన్‌లో కూడా వివరాలు కనిపించడం లేదు. ఇలా సుమారు రూ.20.12 కోట్ల మేర నిధులు రావాల్సి ఉండగా నేటికీ రూపాయి కూడా లబ్ధిదారుల ఖాతాకు జమకాలేదు. నాయకులు చెప్పారని అప్పులు చేసి మరీ ఇళ్లు నిర్మించుకున్న వారు ఇప్పుడు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. తమ బిల్లుల సంగతేంటో తెలియక లబోదిబోమంటున్నారు.

మేమేం చేయలేం.. హౌసింగ్ అధికారులు

బిల్లుల విషయమై గృహ నిర్మాణ శాఖ అధికారులను ప్రశ్నిస్తే లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేయలేదని, ఆన్‌లైన్‌లో కూడా వివరాలు లేవని తామేమి చేయలేమని చెబుతున్నారు. అధికారుల సమాధానంతో లబ్ధిదారులు తలలు పట్టుకుంటున్నారు. మొత్తం మీద గతంలో వైసీపీ ప్రజాప్రతినిధులు మాటను నమ్మి ఇళ్లను నిర్మించుకున్న లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు లేకపోవడం, ఆన్‌లైన్ జాబితాలో వారి వివరాలు కనిపించకపోవటంతో లబ్ధిదారులు అయోమయ పరిస్థితుల్లో ఉన్నారు. ఇప్పటికైనా నిబంధనలకు లోబడి నిర్మించుకున్న తమ ఇళ్లకు సంబంధించి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసి వివిధ దశల్లో ఉన్న తమ ఇళ్లకు గత ప్రభుత్వంలో అందించిన ఆర్థిక సాయం రూ 1.8 లక్షలు అందించి తమను కష్టాల నుంచి గట్టెక్కించాలని లబ్ధిదారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. నేతల మాటలతో తాము నిండా మునిగిపోయామని లబ్ధిదారులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం తమ ఇళ్లకు సంబంధించిన అనుమతులు మంజూరు చేసి బిల్లులు విడుదల చేసి ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదిలా ఉండగా వైసీపీ ప్రభుత్వంలో గృహాలు నిర్మించుకున్న లబ్ధిదారులు జాబితా గృహనిర్మాణం అనుమతులు ఏమైనా ఉన్నాయా? లేక ఇప్పటివరకు బిల్లుల చెల్లింపులు జరిగాయా? అనే విషయంపై స్థానిక గృహ నిర్మాణ శాఖ అధికారిని వివరణ కోరగా వైసీపీ ప్రభుత్వంలో కొంతమంది సొంతంగా నిర్మించుకున్న ఇళ్లకు సంబంధించి అనుమతులు మంజూరైన జాబితా ఇప్పటివరకు తమకు రాలేదని మండపేట గృహ నిర్మాణశాఖ ఇన్‌చార్జి డీఈఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఇలా అయితే ఎలా?

కొన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సేకరణ అంతంతమాత్రమే

రావులపాలెం మండలంలో పట్టుబడి పట్టిన ధాన్యం



- మందకొడిగా ధాన్యం కొనుగోళ్లు
- కొన్ని కేంద్రాల్లో కొద్ది మొత్తంలో మాత్రమే సేకరణ..పూర్తి స్థాయిలో టార్గెట్ లేదని వెనక్కి పంపిస్తున్న వైనం
- క్షేత్రస్థాయిలో సీఎం ఆదేశాలు బేఖాతరు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు రైతులు నేరుగా ధాన్యాన్ని సమీప మిల్లులకు అమ్ముకునే విధంగా కార్యాచరణ రూపొందించి అమలు చేసేందుకు సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారు. ఈ విధానం ప్రారంభ దశలో సజావుగానే సాగింది. అనంతరం అధికారుల అలసత్వం కారణంగా రైతులు పండించిన ధాన్యం కళ్లాల్లో నిలిచిపోయింది. ఇప్పుడు టార్గెట్ లేదని పూర్తిస్థాయిలో ధాన్యం సేకరణ జరగడం లేదు.

రావులపాలెం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో స్వర్ణ రకం, 1318 వరి వంగడాలను రైతులు సాగు చేశారు. అయితే స్వర్ణరకం ప్రకృతి వైపరీత్యాలను తట్టుకోలేకపోవడంతో కొద్దిమేర మాత్రమే సాగుచేశారు. మిగిలినదంతా 1318 రకం. ఇది ప్రస్తుతం కోతలు పూర్తిచేసుకుని ధాన్యపు రాశులుగా ఉంది. రైతులు ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతు సేవా కేంద్రాలకు తీసుకెళ్తుంటే కొద్దిమేర మాత్రమే టార్గెట్ ఉందని, ఆ మొత్తంలోనే ధాన్యాన్ని తీసుకుంటున్నారు. దీనిపై రైతుల్లో తీవ్ర అసంతృప్తి ఉంది. కొందరూ అధికారులు అయితే ధాన్యాన్ని బయట అమ్మేసుకోమని రైతులకు చెబుతుండటంతో రైతులు అయోమయంలో పడ్డారు. కొందరు రైతులు మిల్లు వద్దకు ధాన్యం శాంపిల్స్‌ను పట్టుకుని వెళ్లగా పూర్తి స్థాయిలో తీసుకోవడం లేదు. కేవలం కొద్ది మేర మాత్రమే తీసుకుని మిగిలినది టార్గెట్ లేదని చెబుతున్నారు. అలా అని ఎక్కడో దూర ప్రాంతాల్లో ఉన్న మిల్లులకు ధాన్యం తరలిస్తే ఖర్చులు అధికమైపోతాయంటూ రైతులు ఆవేదన చెందుతున్నారు. రైతులను అన్నివిధాల ఆదుకుని ఆర్థికాభివృద్ధి సాధించేలా చర్యలు తీసుకోవాలనే ఓ వైపు సీఎం చంద్రబాబు చెబుతుంటే క్షేత్రస్థాయిలో మాత్రం అధికారులు ఆ దిశగా పనిచేయడం లేదు. దీంతో సీఎం సంకల్పం నీరుగారిపోతోంది. ఒక పక్క వాతావరణ మార్పులతో ఆందోళనలో ఉన్న రైతులకు పండించిన పంట అమ్ముకునేందుకు అనేక అడ్డంకులు ఏర్పడటంతో కన్నీటి పర్యంతమవుతున్నారు.

ఏరియా ఆస్పత్రిలో అసంపూర్తి పనులను
సత్వరం పూర్తిచేయాలి



వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు

- ఏరియా ఆస్పత్రిలో ఎమ్మెల్యే ఆనందరావు తనిఖీలు

అమలాపురం టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అమలాపురం ఏరియా ఆసుపత్రిలో అసంపూర్తిగా నిలిచిపోయిన పనులను సత్వరం పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అధికారులను ఆదేశించారు. స్థానిక ఏరియా ఆసుపత్రిని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పై అంతస్తులో మధ్యంతరంగా నిలిచిపోయిన పనులను పరిశీలించి సంబంధిత కాంట్రాక్టరును రప్పించి తక్షణం పనులు పూర్తి చేయించాలని సూచించారు. ఆసుపత్రి ప్రాంగణంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదని, వైద్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించి తక్షణం మెరుగు పరిచే విధంగా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఆయన వెంట నేషనల్ హెల్త్ మిషన్ కోఆర్డినేటర్ యోగి, టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు తిక్కిరెడ్డి నేతాజీ, ఆవుపాటి గోపాల్ తదితరులు ఉన్నారు.

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు
బహుళ ప్రయోజనకరంగా ఉండాలి

- పీఏసీఎస్‌ల కంప్యూటరైజేషన్ ప్రక్రియను నెలాఖరు నాటికి పూర్తి చేయాలి
- ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చర్యలు
- జాయింట్ కలెక్టర్ నిషాంతి



అమలాపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు బహుళ ప్రయోజనకరంగా ఉన్నప్పుడే శక్తివంతంగా, ఆర్థిక లాభదాయకంగా రూపాంతరం చెందగలవని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి చెప్పారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అమలు కమిటీ సమావేశం జేసీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పీఏసీఎస్‌ల కంప్యూటరైజేషన్ ప్రక్రియను నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. సహకార సంఘాల్లో ఇతర వ్యాపారాలు అయిన పెట్రోలు బంకుల నిర్వహణ, జలజీవన్ మిషన్ కింద తాగునీటి పైపు లైన్ల ఏర్పాటు, జన ఔషధీ కేంద్రాల నిర్వహణ, కామన్ సర్వీసు కేంద్రాలను రైతుల కోసం అమలు చేయాలన్నారు. ముమ్మిడివరంలో బహుళార్థ మల్టీపర్పస్ ప్రయోజన గోదాము నిర్మాణాన్ని పూర్తిచేసి ఆయా వసతులను నెలాఖరు నాటికి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పీఏసీఎస్‌లను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టిందన్నారు. మత్స్య, పశు సంవర్ధక విభాగాల్లో మల్టీపర్పస్ సంఘాలను ఏర్పాటు చేయాలన్నారు. పాల ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఈ విధంగా చేయడంతో పీఏసీఎస్‌ల ఆదాయ వనరుల పెరగడంతో పాటు పాడి పరిశ్రమ, చేపల పెంపకం, నిల్వ వంటి బహుళ ప్రయోజనకర కొత్త రంగాల్లో కొత్త ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కంప్యూటరీకరణ ద్వారా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు బలోపేతం చేయాలన్నారు. పీఏసీఎస్‌లను నాబార్డుతో అనుసంధానం చేసి డిజిటలైజేషన్ సపోర్టు సిస్టమ్స్ నేషనల్ ఇంటిగ్రేటెడ్ సాఫ్ట్‌వేర్‌ను నాబార్డు రూపొందించిందన్నారు. తద్వారా ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. బ్యాంకుల మాదిరిగా సహకార సంఘాలను డిజిటలైజేషన్ చేసి అక్రమాలకు చెక్ పెట్టాలన్న లక్ష్యంగా సంఘాల్లో సాంకేతిక సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. సహకార సంఘాల ఆర్థిక స్థితిగతులను మెరుగు పరచడానికి ఆర్థిక చేయూతను అందించాలన్నారు. ప్రాంతీయ అసమతుల్యతలను తొలగించి వ్యవసాయ అనుబంధ రంగాల్లో సహకార అభివృద్ధిని వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో కమిటీ కన్వీనర్, జిల్లా సహకార అధికారి మురళీకృష్ణ, నాబార్డు డీజీఎం స్వామినాయుడు, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, మార్కెటింగ్ శాఖ ఏడీ కె.విశాలాక్షి, డీసీసీబీ సీఈవో రామచంద్రరావు, పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు ఎల్.విజయారెడ్డి, పీఏసీఎస్ సీఈవోలు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి సహకరించాలి

● ధాన్యం కొనుగోలు ప్రక్రియ విజయవంతం కావాలి ● మిల్లర్లతో జేసీ నిషాంతి




సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నిషాంతి

అమలాపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా నిర్వహించడంలో ప్రభుత్వానికి మిల్లర్లు అన్నివిధాలా సహకరించాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి చెప్పారు. కలెక్టరేట్‌లో జిల్లాలోని మిల్లర్ల యాజమాన్యాలతో సమావేశాలు నిర్వహించారు. ధాన్యం లోడుతో మిల్లులకు చేరే వాహనాలు అన్‌లోడింగ్‌లో జాప్యాలను నివారించాలని సూచించారు. అవసరమైతే హమాలీలను వంతుల వారీగా నియమించుకోవాలన్నారు. అన్‌లోడింగ్‌లో జాప్యం జరిగితే మిల్లర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతుల నుంచి మిల్లర్లపై ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు. ధాన్యం తేమ శాతాన్ని ప్రభుత్వం కొంతమేర సడలించినట్లు చెప్పారు. తేమశాతం పేరుతో ఎటువంటి తరుగులు విధించరాదని సూచించారు. జిల్లాకు 2.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్దేశించారన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఆశాజనకమైన దిగుబడులు వచ్చాయని, రైతులకు ధాన్యం సొమ్ములు నిర్దేశిత 48 గంటలలోపే బ్యాంకు ఖాతాలకు జమ అవుతున్నాయన్నారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ బాలసరస్వతి, జిల్లా పౌరసరఫరాల అధికారి ఎ.ఉదయభాస్కర్, జిల్లా పౌరసరఫరాల శాఖ సహాయ మేనేజర్ నాగేశ్వరరావు, వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు కాకి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ కాంతులతో ధగధగలాడుతున్న కాకినాడ జగన్నాథపురంలోని సెయింట్ థామస్ చర్చి

(ఆంధ్రజ్యోతి-కాకినాడ కార్పొరేషన్)



వందేళ్ల నాటి.. పురాతన చర్చిలు

క్రిస్మస్ సీజన్ మొదలైంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చర్చిలు విద్యుదీకరణతో ధగధగలాడుతున్నాయి. కాకినాడ, రాజమహేంద్రవరం నగరాలతోపాటు ఇతర ప్రాంతాల్లోను క్రైస్తవ దేవాలయాలు ప్రత్యేక శోభను సంతరించుకుంటున్నాయి. డిసెంబరు నెల క్రైస్తవులకు ఎంతో ప్రత్యేకమైనది. అన్ని చర్చిల్లో క్రిస్మస్ సంబరాలు నిర్వహిస్తుంటారు. ఈ వేడుకలు ప్రారంభం కావడంతో చర్చిల వద్ద సందడి కనిపిస్తోంది. ఈ నెలంతా క్రైస్తవులు క్రిస్మస్ సంబరాల్లో భాగంగా ప్రత్యేక ప్రార్థనల్లో గడుపుతారు. ఈ నేపథ్యంలో కాకినాడలోని వందల ఏళ్లనాటి పురాతన చర్చిల విశేషాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

- క్రైస్తవులకు ఆధ్యాత్మికంగా ప్రాధాన్యమైన డిసెంబరు నెల
- చర్చిల్లో క్రిస్మస్ సంబరాలు ప్రారంభం
- విద్యుదీకరణతో ఆకట్టుకుంటున్న చర్చిలు
- చారిత్రక నేపథ్యం కలిగిన ప్రార్థనా మందిరాలు

డచ్ దేశస్తుల సెయింట్ థామస్ చర్చి



ఉమ్మడి జిల్లా పరిధిలో ఉన్న వందలాది చర్చిల్లో అతి పురాతన కాలం నాటివి కాకినాడలోనే ఉన్నాయి. 1780లో వ్యాపారం నిమిత్తం భారతదేశం వచ్చిన డచ్ దేశస్తులు కాకినాడ జగన్నాథపురంలో సెయింట్ థామస్ చర్చిని నిర్మించినట్లు చెప్తారు. పదెకరాల స్థలంలో చుట్టూ ప్రహరీ, ఒక ఎకరం స్థలంలో మందిరాన్ని నిర్మించారు. డచ్ వారి అనంతరం పోర్చుగీస్ వారు ఈ చర్చి బాధ్యతలను చూశారు. తర్వాత కాలంలో బ్రిటీష్ యాజమాన్యం మందిర నిర్వహణ చేపట్టింది. 1947, సెప్టెంబరు 17 నాటికి భారతీయ క్రైస్తవుల చేతుల్లోకి వచ్చింది. అప్పటినుంచి ఈ మందిరానికి సెయింట్ థామస్ పేరుకు అదనంగా చర్చి ఆఫ్ సౌత్ ఇండియా (సీఎస్ఐ) అనే పేరు వచ్చి చేరింది. దీని పరిధిలో కేరళ, కర్నాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌తోపాటు శ్రీలంక కూడా ఉంది. 1974 వరకు ఈ ఆలయంలో ఆంగ్లంలోనే ఆరాధన జరిగేది. 1975 నుంచి తెలుగులో కూడా ఆరాధన ప్రారంభించారు.

ఆర్‌సీఎం చర్చి: 1886

కాకినాడ జగన్నాథపురంలో మరో ప్రాచీన చర్చి ఉంది. దీన్ని కూడా ఆంగ్లేయుల కాలంలోనే 1886లో నిర్మించారు. సెయింట్ ఆర్మ్ రోమన్ కేథలిక్ మిషన్(ఆర్సీఎం) చర్చిగా పిలుస్తారు. దీంట్లో ఏసుక్రీస్తుకు జన్మనిచ్చిన మేరీమాత విగ్రహం ప్రాచుర్యాన్ని పొందింది. కష్టాల్లో ఉన్నప్పుడు ముందుగా ఆలయ ప్రాంగణంలో ఉన్న మేరీమాతను దర్శించుకుని కొవ్వొత్తులు వెలిగించి తమ బాధలను ప్రార్థనల రూపంలో చెప్పుకుంటే మనశ్శాంతి కలుగుతుందని క్రైస్తవుల నమ్మకం.



కాకినాడ జగన్నాథపురంలోని ఆర్‌ఎంసీ చర్చి

118ఏళ్ల నాటి బాప్టిస్ట్ చర్చి

కాకినాడ జగన్నాథపురంలోనే 1906లో నిర్మించిన బాప్టిస్టు చర్చి ఉంది. 118ఏళ్ల క్రితం అప్పటి ఆంగ్లేయులు నిర్మించారు. దీన్ని కాకుండా నగరంలోని రాజారామ్మోహనరావు రోడ్డులోని గ్రేట్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చి, ఎల్విన్‌పేటలోని బాప్టిస్ట్ చర్చి, రామారావుపేటలోని లూథరన్ చర్చిలను పురాతన కాలంలో నిర్మించారు. క్రిస్మస్ నెల ప్రారంభం కావడంతో అన్ని చర్చిలు లైటింగ్‌తో కళకళలాడుతున్నాయి.



విద్యుత్ వెలుగులతో కళకళలాడుతున్న కాకినాడ జగన్నాథపురంలోని బాప్టిస్ట్ చర్చి

'పిఠాపురంలో అలా మొదలైంది' చిత్రీకరణకు శ్రీకారం

- నటకిరీటి రాజేంద్రప్రసాద్‌పై సినిమా ముహూర్తపు సన్నివేశం షూటింగ్

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గం సినిమా షూటింగ్‌లకు వేదికగా మారుతోంది. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు సీతారామస్వామి దేవస్థానం(రామాలయం)లో 'పిఠాపురంలో అలా మొదలైంది' సినిమా చిత్రీకరణ ప్రారంభమైంది. ప్రముఖ దర్శకుడు మహేష్‌చంద్ర దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా ముహూర్తపు సన్నివేశాలను నటకిరీటి రాజేంద్రప్రసాద్‌పై జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు) క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు మహేష్ చంద్ర మాట్లాడుతూ గోదావరి జిల్లా ప్రాంతానికి చెందిన తాను ఎన్నో విజయవంతమైన సినిమాలకు దర్శకత్వం వహించానన్నారు. సరికొత్త ప్రేమకథా అంశంతో చిత్రాన్ని నిర్మించబోతున్నామని, ఇదే ప్రాంతంలో నెలరోజులపాటు చిత్ర నిర్మాణం జరుగుతుందని వివరించారు. జిల్లాలో ఉన్న నటీనటులకు, ఔత్సాహికులకు ఈ సినిమాలో నటించే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ చిత్రంలో డాక్టర్ రాజేంద్రప్రసాద్‌తోపాటు థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీ పృథ్వీరాజ్, సీనియర్ నటి జె.వాహిని, నటుడు కేదార్‌శంకర్, జబర్దస్త్ ఆర్టిస్ట్ కేవీపాల్, బీఎస్ రాజు తదితర నూతన నటీనటులతో ఈ చిత్రాన్ని చిత్రీకరిస్తున్నామన్నారు. ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ తీన్‌మార్ మల్లన్న మాట్లాడుతూ చిత్రం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. అనంతరం రామాలయ ఆవరణలో పెళ్లి సన్నివేశాలను చిత్రీకరించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, ఓదూరి నాగేశ్వరరావు, కిషోర్, పిఠాపురం సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.



ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొడుతున్న పిఠాపురం జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి



అన్నవరం నూతన ఈవోగా

సుబ్బారావు

రేపు బాధ్యతల స్వీకారం

అన్నవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం ఈవోగా వీర్ల సుబ్బారావు బాధ్యతల స్వీకరణకు దేవదాయ శాఖ ఇన్‌చార్జి ముఖ్య కార్యదర్శి కమిషనర్ సత్యనారాయణ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రెవెన్యూ శాఖలో డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్న సుబ్బారావును అన్నవరం ఈవోగా నియమిస్తూ గత నెల 29న ఉత్తర్వులిచ్చినా రిలీవ్ కాకపోవడంతో కొంత సందిగ్ధత నెలకొంది. సుబ్బారావును ఈవోగా ఏడాది పాటు డిప్యూటేషన్‌పై నియమిస్తూ కమిషనరు కార్యాలయం నుంచి ఆదేశాలొచ్చాయి. కొత్త ఈవోగా సుబ్బారావు శనివారం బాధ్యతలు స్వీకరిస్తారని దేవస్థానం అధికారులు వెల్లడించారు.

15న సత్యదేవుని మెట్లోత్సవం

అన్నవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస ప్రారంభ సూచికగా ప్రతిఏటా సత్యదేవుని సన్నిధిలో నిర్వహించే మెట్లోత్సవాన్ని ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం స్వామి, అమ్మవార్ల గ్రామసేవ అనంతరం 9.30 గంటలకు తొలి మెట్టు వద్ద పండితులు ప్రత్యేక పూజలు జరుపుతారు. అనంతరం స్వామివారి ప్రధానాలయం వరకు ఉన్న ప్రతి మెట్టుకు మహిళలు పసుపు, కుంకుమ పూసి హారతులిచ్చి నైవేద్యాలు సమర్పిస్తారు. సుమారు 380 మెట్లకు ఈ పూజా కార్యక్రమాలు చేపడతారు. 15 నుంచి సంక్రాంతి వరకు స్వామి, అమ్మవార్లకు ప్రతినిత్యం వెండి పల్లకిలో గ్రామసేవ నిర్వహిస్తారు.





శ్రీరామ పాదుకల విశిష్టతను వివరిస్తున్న అహోబిల స్వామి. చిత్రంలో త్రిదండి చినజీయర్ స్వామి

వైభవంగా శ్రీరామ పాదుకా పట్టాభిషేకం

- త్రిదండి చినజీయర్ స్వామి, అహోబిల స్వామి రాక
- వేలాది మంది భక్తులతో కరసేవ
- ఆంధ్ర భద్రాద్రి క్షేత్రం పేరు తులా గిరిగా మార్పు

ప్రత్తిపాడు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు గ్రామ పరిధిలోని నరేంద్రగిరి రామాలయ నిర్మాణ ప్రదేశం వద్ద శ్రీరామ పాదుకా పట్టాభిషేక మహోత్సవాన్ని త్రిదండి చినజీయర్ స్వామి గురువారం వైభవంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. తొలుత త్రిదండి చినజీయర్ స్వామితోపాటు త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి వర్తక సంఘం అధ్యక్షుడు అనంతపల్లి శ్రీను నివాసానికి చేరుకుని అక్కడ తీర్థ గోష్ఠి నిర్వహించారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా, టీడీపీ నాయకుడు కొమ్ముల కన్నబాబు జీయర్ స్వామిని దర్శించుకున్నారు. ఎస్‌బీఐ వీధి నుంచి ఓపెన్ టాప్ జీపులో ఊరేగింపుగా బయల్దేరిన స్వామీజీలు వేలాది మంది భక్తులు, మంగళవాయిద్యాల మధ్య కర సేవ చేస్తుండగా నరేంద్రగిరికి చేరుకున్నారు. అక్కడ వారికి నిర్వాహకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం చినజీయర్ స్వామి మెట్ల మార్గాన్ని ప్రారంభించి భక్తులకు అనుగ్రహభాషణ చేశారు.

సమస్త దోషాలను తొలగించి సర్వ మానవాళికి శాంతి, శ్రేయస్సు ప్రసాదించేదే శ్రీరామ పాదుకా పట్టాభిషేకం అని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి అన్నారు. సమతామూర్తి శ్రీరాముడి పాదుకలను ఆశ్రయించి ఆరాధిస్తే సంపద, రాజ్యం పదింతలు అయ్యాయని ప్రవచించారు. అహల్య పాపాలను తొలగించడం, భరతుడి తాపాన్ని పోగొట్టి ధర్మకర్తగా నిలపడం, సుగ్రీవుడి భయాన్ని తీర్చి సుఖ సంపదలు ఇవ్వడం, శరణుకోరిన విభీషణుడిని రారాజు చేయడం, రుషులకు శాంతిని పెంచి పక్షికి మోక్షం ఇవ్వడం వంటివి శ్రీరాముడి మహిమలన్నారు. పాదుకా పట్టాభిషేకం ఆవశ్యకతను, శ్రీరామ చరిత్రను అహోబిల రామానుజ జీయర్ స్వామి, భరతుడు శ్రీరామ పాదుకలతో రాజ్యం పాలించిన విధానాన్ని నేపాల్ కృష్ణమాచార్యులు వివరించారు.

ఆంధ్ర భద్రాద్రి రామ క్షేత్రంగా ఉన్న పేరును చిన జీయర్ స్వామి మార్పు చేశారు. ప్రత్తిపాడులోని ప్రత్తి అనగా తులమని అర్థం కలిగి ఉందని, భద్రాద్రిలో భద్రుడి ప్రార్థనకు కరిగివచ్చిన రాముడు ప్రత్తిపాడు ప్రజల ప్రార్థనకు ఇక్కడ కొలువుదీరనున్నారు. అందుకే ఈ ప్రాంతానికి తులాగిరి శ్రీరామ క్షేత్రంగా నామకరణం చేస్తున్నట్టు భక్తుల కరతాళ ధ్వనుల మధ్య జీయర్ స్వామి ప్రకటించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రసాదాలు పంపిణీ చేశారు. శ్రీరామ సేవక్ కమిటీ సభ్యులు అనంతపల్లి శ్రీను, గోగుల బుజ్జి, రెడ్నం రాజా, స్థానిక ప్రముఖుడు ముదునూరి మురళీకృష్ణంరాజు, జడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, డీవీఎస్ రాజురమేష్, స్థల దాతలు చలంకూరి భాను కుటుంబ సభ్యులు పూజల్లో పాల్గొన్నారు.





ప్రత్తిపాడులో కర సేవకుల ప్రదర్శన, పాదుకా పట్టాభిషేక మహోత్సవాన్ని తిలకిస్తున్న మహిళలు



మధురపూడి విమానాశ్రయం వద్ద ఢిల్లీకి నూతన సర్వీసు ప్రారంభించి కేక్ కట్ చేస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు. చిత్రంలో ఎంపీలు పురందేశ్వరి, ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్యేలు

రాజమహేంద్రవరం నుంచి నేరుగా ఢిల్లీకి విమానం

- ప్రారంభమైన ఇండిగో సర్వీసులు.. ఇన్నాళ్లకు చిరకాల వాంఛ నెరవేరింది..
- విమాన సర్వీసును ప్రారంభించిన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి

కోరుకొండ, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నుంచి ఢిల్లీకి నూతనంగా విమాన సర్వీసు ప్రారంభించడం ద్వారా ఇన్నాళ్లకు ఇక్కడి ప్రజల చిరకాల వాంఛ నెరవేరిందని కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. న్యూఢిల్లీ రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి నేరుగా గురువారం ఉదయం 9 గంటలకు 6ఈ364 ఇండిగో విమాన సర్వీసు మధురపూడి విమానాశ్రయానికి చేరుకుంది. నియమాలను అనుసరించి నీటిని వెదజల్లి నూతన విమాన సర్వీసుకు స్వాగతం పలికారు. ఈ తొలి విమాన సర్వీసులోనే ప్రయాణికులతో కలిసి న్యూఢిల్లీ నుంచి రాజమహేంద్రవరం చేరుకున్న కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు రాజమహేంద్రవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. ఢిల్లీ నుంచి బయల్దేరి వచ్చిన ఈ తొలి విమాన సర్వీసుకు మధురపూడి విమానాశ్రయం వద్ద రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి వాసు, జ్యోతుల నెహ్రూ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మద్దిపాటి వెంకట్రాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు, జాయింట్ కలెక్టర్ ఎస్.చినరాముడు, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎస్.జ్ఞానేశ్వర్ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రాజమండ్రి విమానాశ్రయం వద్ద కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి రాజమండ్రి నుంచి న్యూఢిల్లీకి వెళ్లే నూతన విమాన సర్వీసును ఉదయం 9.45 గంటలకు ప్రారంభించారు.

ఈ సందర్భంగా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ రాజమహేంద్రవరం విమానాశ్రయం అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ మొట్టమొదటి అడుగుగా రాజమండ్రి నుంచి దేశ రాజధాని ఢిల్లీకి నూతన ఎయిర్‌బస్ కల్పించిన ఘనత ప్రధాని నరేంద్రమోదీదేనన్నారు. త్వరలో గోదావరి పుష్కరాలు రానున్న నేపథ్యంలో రాజమహేంద్రవరానికి యావత్తు భారతదేశానికి విమాన సర్వీసులు అవసరమయ్యే ఆవశ్యకత ఉందన్నారు. అలాగే రాజమహేంద్రవరం నుంచి తిరుపతి, వారాణసి, షిరిడి వంటి నగరాలకు విమాన సర్వీసులు నడిపేలా కేంద్రమంత్రి కృషిచేయాలని కోరారు. అనంతరం ప్రయాణికులతో మధురపూడి విమానాశ్రయం నుంచి బయల్దేరిన ఇండిగో నూతన విమాన సర్వీసు మధ్యాహ్నం 12 గంటలకు న్యూఢిల్లీకి వెళ్లింది. కాగా ఈనెల 1న వాణిజ్య రాజధాని ముంబైకి విమాన సర్వీసు ప్రారంభమైన సంగతి తెలిసిందే. ముంబై, ఢిల్లీ విమాన సర్వీసుల కోసం ఎంతోకాలంగా ఎదురుచూసిన ఉభయగోదావరి జిల్లావాసుల కల ఇన్నాళ్లకు నెరవేరింది.



హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

వాడపల్లి వెంకన్న హుండీల ఆదాయం రూ.1.38 కోట్లు

బంగారం 31 గ్రాములు, వెండి 990 గ్రాములు, పలు దేశాల కరెన్సీ లభ్యం

ఆత్రేయపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలోని హుండీలను పర్యవేక్షణాధికారులు వి.సత్యనారాయణ, టి.ప్రసాద్ సమక్షంలో గురువారం తెరిచి వసంత మండపంలో లెక్కించారు. 37 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.92,16,755, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.42,47,958... మొత్తం రూ.1,38,49,477 ఆదాయం లభించింది. బంగారం 31 గ్రాములు, వెండి 990 గ్రాములు, పలు దేశాల విదేశీ కరెన్సీ వచ్చాయని ఆలయ ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. క్షేత్రపాలకుడు విశ్వేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.3,84,744 లభించింది. లెక్కింపులో గ్రామస్థులు, అర్చకులు, ఆలయ సిబ్బంది, బ్యాంకు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.



వ్యానులో తరలిస్తుండగా పట్టుకున్న ఫర్నిచర్

అంతా టేకుమయం

అటవీ శాఖ అధికారిణి తరలించిన ఫర్నిచర్ వివరాలు వెల్లడించిన కూనవరం రేంజర్

ఎటపాక, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం అటవీ శాఖలో రేంజర్‌గా పనిచేసి ఇటీవల బదిలీ వెళ్లిన అధికారిణి తాలూకా టేకు ఫర్నిచర్‌ను బుధవారం రాత్రి ఐషర్ వ్యాన్‌లో తరలిస్తుండగా నందిగామ వద్ద గ్రామస్తులు అడ్డగించి పట్టుకున్న సంగతి తెలిసిందే. వెంటనే ఆ ఫర్నిచర్‌ను, వ్యాన్‌ను అటవీ శాఖ సిబ్బంది పురుషోత్తపట్నంలోని అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. గురువారం ఉదయం కూనవరం రేంజర్ కరుణాకర్ సమక్షంలో లారీలోని టేకు ఫర్నిచర్‌ను బయటకు తీసి విచారించారు. అందులో పాత (పాలిష్ వేసిన) టేకు టేబుల్, డైనింగ్ టేబుల్, డ్రెస్సింగ్ టేబుల్, దివాన్‌కాట్, టేకు కుర్చీలు, టేకు మంచాలు, నాన్ టేకు దిమ్మ లభ్యమైనట్టు రేంజర్ కరుణాకర్ తెలిపారు. ఎటువంటి పత్రాలు లేకుండానే వాటిని రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. వ్యాన్‌ని స్వాధీనం చేసుకున్నారు. వీటికి సంబంధించిన పత్రాలు చూపించాలని బదిలీ అయిన అటవీ శాఖ అధికారిణి విజయలక్ష్మిని అడగ్గా పత్రాలు తీసుకొస్తానని చెప్పిందని కరుణాకర్ చెప్పారు. విచారణ అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

డివైడర్‌ని ఢీకొని వ్యక్తి మృతి

శంఖవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కత్తిపూడి వద్ద 16వ జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. అన్నవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... జెడ్.రాగంపేట గ్రామానికి చెందిన శ్రీమంతుల వీర వెంకటరమణ (37) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గురువారం స్నేహితుడు పల్సర్ బైక్ తీసుకుని సొంత పనిమీద తుని బయల్దేరాడు. కత్తిపూడి శివారు సీతంపేట బంకు సమీపంలో డివైడర్‌ని బలంగా ఢీకొట్టడంతో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య సుబ్బలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీహరిబాబు తెలిపారు.



బాలబాలాజీ హుండీ లెక్కింపు నిర్వహిస్తున్న సిబ్బంది

బాలబాలాజీ హుండీ ఆదాయం రూ.13,35,485

మామిడికుదురు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ హుండీ ఆదాయం రూ.33,35,485 వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. 42 రోజులకుగాను హుండీల లెక్కింపును గురువారం నిర్వహించారు. లెక్కింపు కార్యక్రమానికి అమలాపురం తనిఖీదారు జె.రామలింగేశ్వరరావు పర్యవేక్షణాధికారిగా హాజరయ్యారు. ఈ ఆదాయంతోపాటు 0.2 గ్రాముల బంగారం, 0.120 గ్రాముల వెండి ఆదాయంగా వచ్చిందన్నారు. లెక్కింపు కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, గ్రామస్తులు, అర్చకులు, స్వామివారి సేవకులు, బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



15 నుంచి కోట సత్తెమ్మ తల్లి తిరునాళ్లు

నిడదవోలు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరిజిల్లా నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మతల్లి దేవస్థానంలో ఈనెల 15 నుంచి 19 వరకు తిరునాళ్ల మహోత్సవాలు నిర్వహించనున్నామని సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. 15న ఫౌండర్ ఫ్యామిలీమెంబర్ అండ్ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్ దంపతులు కలశస్థాపనతో ఉత్సవాలను ప్రారంభించి అమ్మవారికి లక్ష కుంకుమార్చన విశేష పూజలు నిర్వహించనున్నారు. 16న గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి దేవస్థానం, నిడదవోలు నాంగల్యదేవి దేస్థానం వారితో సారె సమర్పణ, 17న నిడదవోలు ఆర్యవైశ్య సంఘం సారె సమర్పణ, 18న రాజమహేంద్రవరం నుంచి 101 మంది మహిళలతో సారె, పసుపు కుంకుమ సమర్పణ, 19న తిరునాళ్ల ముగింపోత్సవం జరుగుతాయని సహాయ కమిషనర్ తెలిపారు.

నాన్న గద్దర్ ఇచ్చిన స్ఫూర్తి..ప్రజలే నాకు ఆదర్శం

గద్దర్ జాతీయ సేవా అవార్డుల పంపిణీలో వెన్నెల గద్దర్



పి.గన్నవరంలో గద్దర్ జాతీయ సేవా పురస్కార అవార్డులను ప్రధానం చేస్తున్న వెన్నెల గద్దర్, ఎమ్మెల్యే సత్యనారాయణ

పి.గన్నవరం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): నాన్న గద్దర్ లేకపోయినప్పటికీ ఆయన ఇచ్చిన స్ఫూర్తి, ప్రజలను ఆదర్శంగా తీసుకుని ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళుతున్నానని తెలంగాణ రాష్ట్ర సంస్కృతిక సారధి చైర్మన్ డాక్టర్ వెన్నెల గద్దర్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా పి.గన్నవరం సాయితేజ జూనియర్ కళాశాలలో జరిగిన గద్దర్ జాతీయ సేవా పురస్కారాలు పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అధ్యక్షత వహించగా ఆమె పాల్గొని మాట్లాడారు. నాన్న ఆశయాలను ముందుకు తీసుకువెళ్లడానికి అవకాశం కల్పించిన జాతీయ కాంగ్రెస్ అధినాయకులకు, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అధినాయకులకు పేరుపేరున వందనాలు తెలుపుతున్నట్లు ఆమె తెలిపారు. ఎమ్మెల్యేగా ఓటమి పొందిన సమయంలో నారాజ్యం, నారాజు గెలిచాడని చాటిచెప్పినట్లు ఆమె వివరించారు. అనంతరం నాప్రభుత్వం రాష్ట్ర సంస్కృతిక సారధి చైర్మన్‌గా అవకాశం కల్పించి నాపాట, ఆటతో, మాటతో, నాటకాలతో పల్లె పల్లెకు తిరిగి ప్రజలను చైతన్యవంతం చేసే అవకాశం మా ప్రభుత్వం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. మనమందరం తెలుగు తల్లి పిల్లలు కావడంతో అదే గజ్జెల సవ్వడితో ఏపీలో కూడా ముందుకు వస్తున్నానని చెప్పారు. గద్దర్ ఆశయాలు ఏమిటంటే అందరూ బాగా చదువుకోవాలి-జ్ఞానం ఒక్కటే మిగులును, ఎక్కడైతే అణచివేత ఉంటుందో..అక్కడ తిరుగుబాటు ఉండాలన్నదే నాన్న ఆశయాలన్నారు.

అన్నలారా లెండిరా.....

నాకు జన్మనిచ్చిన తల్లివి, నాకుతోడబుట్టిన చెల్లివి, ఎన్నాళ్ల కన్నీళ్లు, నువ్వు బతుకులు మార్చే శక్తివి, హే హే అమ్మ నువ్వు మహాశక్తివి తల్లి అంటూ గద్దర్ వెన్నెల విప్లవ గీతాన్ని ఆలపించారు. అదేవిధంగా విద్యార్థులకు సామాజిక సందేశాన్నిచ్చే రెండు కథలను వివరించి వాటికి అర్థం చెప్పారు. రోజు ఒక కథ విని పడుకోండి అంటూ విద్యార్థులకు మదర్ థెరిస్సా జీవిత సేవలను వివరించారు. మదర్ థెరిస్సా తన 12వ ఏటలోనే జీవితలక్ష్యం ఎంచుకున్నారన్నారు. 69ఏళ్ల పాటు భారదేశంలో బడుగు బలహీన వర్గాల ప్రజలకు సేవలందించారన్నారు. సమాజంలో సేవలందించే వారిని గుర్తించి పురస్కారాలు అందించాలనే ఆలోచన రావడం మంచి పరిణామమని చెబుతూ అవార్డుల నిర్వహణలో పాల్గొన్న మమత స్వచ్ఛంద సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కోరుకొండ జాన్‌కు అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజాసమస్యలను పాటరూపంలో వివరిస్తూ సమాజంలో మార్పుకోసం పోరాడిన మహోన్నత వ్యక్తి, శక్తి గద్దరన్న అని కొనియాడారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ఎన్నో విప్లవ గీతాలను రచించి, ఆలపించారన్నారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా వివిధ రంగాలవారు 110మందికి అవార్డులు అందించి సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, మాజీ జెడ్పీ ప్రతిపక్షనేత సాకా ప్రసన్నకుమార్, మనం ఫౌండేషన్ చైర్మన్ చక్రవర్తి, ముదునూరి లతేంద్రవర్మ, బల రామ్మూర్తి, దాసరి రత్నం, హనుమాన్,పెద్దకాపు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో లక్ష్యాలను చేధించాలి

- నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్
- అంతర్ కళాశాలల విలు విద్య పోటీలు



బాణం వేసి విలువిద్యపోటీలను ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ సుధాకర్

దివాన్‌చెరువు, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): ఏకలవ్యుని మాదిరిగా ఏకాగ్రతతో లక్ష్యాలను చేదించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, క్రీడాబోర్డు ఇన్‌చార్జి కార్యదర్శి ఆచార్య జి.సుధాకర్ అన్నారు. నన్నయ వర్శిటీ విద్య కళాశాల ఆధ్వర్యంలో అంతర్ కళాశాలల విలువిద్య పోటీలు, విశ్వవిద్యాలయ జట్టు ఎంపికలను గురువారం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సుధాకర్ గురివైపు బాణం సంధించి పోటీలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విలువిద్యను ప్రోత్సహించడంలో నన్నయ విశ్వవిద్యాలయం వ్యాయామవిద్య విభాగం చేస్తున్న కృషిని అభినందించారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని నన్నయ అనుబంధ కళాశాలల నుంచి పురుష, మహిళ అభ్యర్థులు 40 మంది హాజరయ్యారు. ఇండియన్ రౌండ్ ఆర్చరీ విధానంలో పోటీలు నిర్వహించారు. ప్రతిభావంతులైన నలుగురు పురుషులను, నలుగురు మహిళలను విశ్వవిద్యాలయ జట్టుగా ఎంపిక చేశారు. వీరిలో పురుషుల్లో టి.అజయ్(ఎస్‌కేవీటీ కళాశాల, రాజమహేంద్రవరం), పి.కృష్ణ(సీబీఆర్ కళాశాల, పిఠాపురం) యు.మహేష్‌బాబు, వి.వెంకటప్రసాద్(ప్రభుత్వడిగ్రీ కళాశాల, చింతలపూడి) ఎంపికయ్యారు. మహిళల్లో డి.మానస, జి.నవ్యమమత(ఏఎస్‌డీ కళాశాల, కాకినాడ), జి.సావిత్రి, సీహెచ్ అంజలి(ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చింతలపూడి)లు ఎంపికయ్యారు. వీరు ఈనెల 22నుంచి 26వరకూ భువనేశ్వర్‌లోని కిట్ విశ్వవిద్యాలయంలో జరిగే అఖిల భారత విశ్వవిద్యాలయాల పోటీల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక చైర్మన్ కె.సుబ్బారావు, కార్యదర్శి వి.సాల్మన్‌దేవానంద్, పరిశీలకుడు సీవీ సుబ్రహ్మణ్యం, ఎంపిక కమిటీ సభ్యులు ఆలీ, విజయ్‌కుమార్, వ్యాయామ విద్య అధ్యాపకులు ఆర్.సాంబశివరావు, బి.రామ్‌గోపాల్, బాలసత్యనారాయణ, విశ్రాంత ఎంఈవో గోపాలకృష్ణ, టి.లక్ష్మణ్, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్చరీ పోటీలకు పిఠాపురం విద్యార్థి ఎంపిక



పిఠాపురం విద్యార్థి కృష్ణతో కోచ్ లక్ష్మణరావు

పిఠాపురం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు పిఠాపురం విద్యార్థి ఎంపికయ్యారు. రాజమహేంద్రవరంలోని నన్నయ్య యూనివర్సిటీలో జరిగిన ఇంటర్ కాలేజీ ఆర్చరీ పోటీల్లో పిఠాపురం పట్టణంలోని సీబీఆర్ డిగ్రీ కళాశాలలో బీకాం కంప్యూటర్స్ సెకండియర్ చదువుతున్న పి.కృష్ణ ఇండియన్ రౌండ్ వ్యక్తిగత ఆర్చరీ ఈవెంట్‌లో రజత పతకం సాధించాడు. ఇందులో చూపిన ప్రతిభ ఆధారంగా ఒడిసా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో జరుగుతున్న ఆల్‌ఇండియా యూనివర్సిటీస్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. కృష్ణ ను, అతనికి శిక్షణ ఇచ్చిన కోచ్ లక్ష్మణరావులను పలువురు అభినందించారు.

పెద్దాపురం మున్సిపల్ కమిషనర్ పేరుతో ఫేక్ కాల్స్

- ట్రేడ్ డబ్బులు ఫోన్ పే చేయాలని దుకాణదారులకు ఫోన్
- పోలీసులకు ఫిర్యాదుచేసిన కమిషనర్

పెద్దాపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం మున్సిపల్ కమిషనర్ పేరుతో ఓగుర్తు తెలియని వ్యక్తి నుంచి పట్టణంలో పలువురు దుకాణదారులకు ఫోన్‌కాల్స్ వచ్చాయి. మున్సిపల్ ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలని లేకపోతే ఇబ్బందులు తప్పవని సదరు వ్యక్తి దుకాణదారులకు కాల్స్ చేసి నేనుచెప్పిన నంబర్‌కు నగదును ఫోన్ పే చేయాలని లేకపోతే షాప్ సీజ్ చేస్తామని చెప్పడంతో పలువురు కంగారుపడ్డారు. గతేడాది ట్రేడ్‌కు సంబంధించి ట్యాక్సులు చెల్లించినా మళ్లీ ఎందుకు అడుగుతున్నారని అనుమానం వచ్చి పలువురు దుకాణదారులు ఆందోళనకు గురయ్యారు. ఫేక్ ఫోన్ కాల్ చేసిన వ్యక్తి నెం.7569778380 నుంచి కాల్స్‌చేసి డబ్బులు అడిగినట్లు తెలియడంతో పలువురు ఈవిషయాన్ని ఆంధ్రజ్యోతి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతిని ఆరా తీయడంతో ఈవిషయం తన దృష్టికి వచ్చిందని తాను ఎవరికీ ఫోన్ చేయలేదన్నారు. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈవిషయంపై ఎస్‌ఐ మౌనికను వివరణ కోరగా ఈవిషయం తమ దృష్టికి వచ్చిందని, వ్యాపారులను ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. డబ్బులు ఎవరూ చెల్లించి మోసపోవద్దని ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని చెప్పారు.

జాతీయస్థాయి వర్క్‌షాపునకు మంగారాణి ఎంపిక



ఎంపిక పత్రాన్ని మంగారాణికి అందిస్తున్న డీఈవో వాసుదేవరావు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో నిర్వహించే జాతీయ వర్కుషాపునకు రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ నాగరాజా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మోటూరి మంగారాణి ఎంపికయ్యారు. ఈ మేరకు ఎంపికైన పత్రాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి వాసుదేవరావు అందించారు. నేషనల్ సెంటర్‌ఫర్ స్కూల్ లీడర్‌షిప్(ఎన్‌సీఎస్‌ఎల్ న్యూపా)వారు ఢిల్లీలో నిర్వహించనున్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందించేందుకు పెడగోగికల్ లీడర్‌షిప్ అనే అంశంపై నిర్వహించే కంటెంట్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్‌లో మంగారాణి పాల్గొంటారు. ఈ వర్కుషాపులో పాల్గొనే అవకాశం ఆంధ్రప్రదేశ్ నుంచి మంగారాణి ఒక్కరికే రావడంతో జిల్లా విద్యాశాఖ హర్షం వ్యక్తం చేసింది. ఈ వర్క్‌షాపు ఈనెల 17 నుంచి 20వ తేదీ వరకు ఢిల్లీలోని ఎన్‌ఎస్‌సీఎల్‌లో జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా మంగారాణిని అర్బన్ డీఐ బి.దిలీప్ కుమార్, అర్బన్ ఎంఈవో-2 రమారజనీ అభినందించారు.

జాడలేని పులి

ధారపల్లి జలపాతం మూసివేత

ప్రజలను అప్రమత్తంచేసిన ఫారెస్టు అధికారులు

ప్రత్తిపాడు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా ప్రత్తిపాడు మండలం బురదకోట అటవీప్రాంతంలో తిష్టవేసిన పెద్దపులి జాడ గురువారం అటవీ అధికారులకు చిక్కలేదు. ఐదురోజుల క్రితమే బురదకోట అటవీ ప్రాంతానికి వచ్చిన పెద్ద పులి చంపిన లేగదూడ ప్రదేశానికి కూడా రాలేదు. దీంతో పులి జాడ తెలియక అటవీశాఖ అధికారులు, సిబ్బంది గాలింపు ముమ్మరం చేశారు. బురదకోట కేంద్రంగా 3కిలో మీటర్ల పరిసరాల్లో ఏర్పాటుచేసిన ట్రాప్ కెమెరాలను గురువారం పరిశీలించిన పులి ఆచూకీ లభించలేదు. దీంతో అటవీప్రాంతాలను ఆనుకుని ఉన్న సబ్‌ప్లాన్ ఏజెన్సీ ప్రాంతాల్లో ఏ సమయంలోనైనా పులి సంచరించవచ్చని ఆయా గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఇదిలావుంటే పులి సంచరించే బురదకోట సమీపాన ఉన్న ధారపల్లి జలపాతం వద్దకు పులి రావచ్చనే ముందుజాగ్రత్త చర్యగా ఏలేశ్వరం ఫారెస్ట్ రేంజ్ అధికారి దుర్గారాంప్రసాద్ ధారపల్లి జలపాతం మార్గాన్ని మూసివేశారు. ఈ జలపాతం వద్దకు సందర్శకులు రాకుండా మార్గం మూసి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ధారపల్లి వచ్చే పర్యాటకుల సంఖ్య తగ్గిపోయింది. పులి హెచ్చరికలకు జలపాతం వద్దకు ఎవరినీ అనుమతించడంలేదు. బాపన్నదొర రైతుకు చెందిన లేగదూడను పెద్దపులి చంపిన ఘటన తరువాత పశువులపై ఎటువంటిదాడి జరిగిన సమాచారం లేదు. చంపిన లేగదూడ కళేబరం వద్దకు పులి రాకపోవడం అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలువల్ల విశ్రాంతి దశలో పులి ఉండవచ్చని గిరిజనులు అభిప్రాయపడుతున్నారు.



ధారపల్లి జలపాతం మార్గాన్ని బంద్ చేసి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న అటవీశాఖ సిబ్బంది

బండిరేవులో దారి దోపిడీ

- స్టేషన్‌కు రమ్మంటూ ద్విచక్ర వాహనాన్ని ఎత్తుకెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు
- పోలీస్ స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు

ఎటపాక, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నడూ జరగనిరీతిలో అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలంలోని బండిరేవు గ్రామంలో జాతీయ రహదారిపై బుధవారం రాత్రి సరికొత్త దొంగతనం జరిగింది. కారులో వచ్చి రహదారి పక్కన నిల్చున్న ఇద్దరు ఆదివాసీ యువకుల చేతులు పట్టుకుని, కొంత నగదును, దిచక్ర వాహనం ఎత్తుకెళ్లిన ఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. సాలెబుడపు ఆదివాసీ గ్రామానికి చెందిన మడకం దేవయ్య, మడివి ఇర్మా ఇద్దరూ ద్విచక్ర వాహనంపై బుధవారంరాత్రి నెల్లిపాక వెళ్తున్నారు. బండిరేవు శివారులో వీరు ద్విచక్ర వాహనం ఆపి ఉండగా, భద్రాచలం వైపు నుంచి చింతూరు వైపు వస్తున్న కారులో నలుగురు వ్యక్తులు వారివద్ద ఆపి, ఇద్దరి యువకులను చేతులమడిసి సెల్‌ఫోన్, కొంత సొమ్ములు స్వాదీనం చేసుకున్నారు. అనంతరం వారి ద్విచక్ర వాహనం తీసుకుని చింతూరు వైపు వెళ్లిపోయారు. ఆ గుర్తు తెలియని వ్యక్తులు వెళుతూ రేపు స్టేషన్‌కు వచ్చి, ద్విచక్ర వాహనం తీసుకెళ్లాలని వారికి సూచించారు. కంగుతిన్న యువకులు ఇంతకీ మీరెవరు.. తమ ద్విచక్ర వాహనంను ఎందుకు తీసుకెళ్తున్నారని అడిగితే దౌర్జన్యంగా పక్కకు నెడుతూ, పోలీస్ డిపార్టుమెంట్ అని బెదిరించారని యువకులు చెప్పారు. కాగా ఉదయం ఇద్దరు యువకులు గ్రామ పెద్దల సహకారంతో ఎటపాక, చింతూరు పోలీస్‌స్టేషన్‌లో ఆరా తీయగా, ద్విచక్ర వాహనంను ఎత్తుకెళ్లిన వారు పోలీసులు కాదని నిర్ధారణకు వచ్చారు. దాంతో ఎటపాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇటీవల బండిరేవు జాతీయ రహదారిపై ఈ తరహా దారిదోపిడీ ఘటనలు పెరిగాయని, వాహనదారులు, స్థానిక ఆదివాసీలు భయందోళన చెందు తున్నారు. ఇకనైనా పోలీసులు దారి దోపిడీ దొంగలపై నిఘాపెట్టి, చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



దారిదోపిడీకి గురైన ఆదివాసీ యువకులు వీరే

దివ్యాంగురాలిపై ఫీల్డ్‌అసిస్టెంట్ అత్యాచారయత్నం

కరప, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): తన కుమార్తెపై ఒక వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడినట్టుగా ఒక మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదుచేసినట్టుగా కరప ఎస్‌ఐ తోట సునీత తెలిపారు. వివరాల్లోకి వెళితే..కరపమండలం వేములవాడ గ్రామానికి చెందిన ఒక మహిళ కేటరింగ్ పనిచేసుకుంటుండగా, ఆమె భర్త హైదరాబాద్‌లో పనిచేసుకుంటున్నాడు. వారికి ఒక కుమారుడు, మానసిక స్థితి సరిగా లేని దివ్యాంగురాలైన ఒక కుమార్తె ఉంది. కాగా గత బుధవారం సాయంత్రం సదరు మహిళ కేటరింగ్ పనికి వెళ్తూ కుమార్తెను చూసుకోమని కుమారుడికి చెప్పింది. రాత్రి 9 గంటల సమయంలో సదరు కుమారుడు ఇంటి నుంచి తన పిన్ని ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో ఉపాధిహామీ పథకం ఫీల్డ్‌అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మట్టపర్తి వీరబాబు ఆపి సినిమాకు వెళదామా అని అడిగాడు. దీనికి మాఅక్క ఒక్కరే ఇంట్లో ఉందని, రావడానికి కుదరదని పిన్ని ఇంటికి వెళ్లిపోయాడు. పిన్నిని తీసుకుని తిరిగి తన ఇంటికి వచ్చేసరికి తలుపులు వేసి దివ్యాంగురాలిపై వీరబాబు అత్యాచారయత్నం చేస్తున్నాడు. దీంతో వారు కంగారుపడి కేకలు వేస్తూ తలుపులు గట్టిగా కొట్టడంతో భయపడిన వీరబాబు అక్కడి నుంచి పరారయ్యాడు. దీనిపై బాధితురాలి తల్లి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్టు ఎస్‌ఐ వివరించారు.

మత్స్యకార వర్గాల్లో

రసాయన పరిశ్రమల మామూళ్ల చిచ్చు

- రెండు వర్గాల మధ్య కొట్లాట

కొత్తపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రసాయనాల పరిశ్రమల యాజమాన్యం నుంచి ఒక వర్గానికి చెందిన మత్స్యకారులు రూ.6కోట్లు మామూళ్లు తీసుకున్నారనే విషయంపై గురువారం కోనపాపపేటలో జరిగిన సమావేశం వివాదానికి దారితీసింది. వివరాలు ఇలా ఉన్నాయి. కేఎస్ ఈజెడ్‌లో ఏర్పాటుచేసిన లైఫిజ్ ఫార్మా కంపెనీ నుంచి కోనపాపపేటకు చెందిన బాపన్నదొర, దేముడు అనే వ్యక్తులు రూ.6కోట్లు మామూళ్లు తీసుకున్నారనే అనుమానంపై గురువారం స్థానిక రామాలయంవద్ద మత్స్యకారులు సమావేశమయ్యారు. ఈవిషయం తెలుసుకున్న బాపన్నదొర, అతని సోదరులతోపాటు మరికొంత మంది రామాలయంవద్ద నిర్వహిస్తున్న సమావేశంలోకి వెళ్లి మత్స్యకారు ల్లో వేరే వర్గానికి చెందిన చొక్కాప్రసాద్, పేతురులపై దాడి చేయడం, మత్సకారులందరూ మూకుమ్మడిగా ప్రతిఘటించడంతో అక్కడి నుంచి వారు వెళ్లిపోయారు. బాపన్నదొర, అతని సోదరులతోపాటు మరికొంత మంది తమపై దాడి చేశారని ప్రకాష్, పేతురు కొత్తపల్లి పోలీసుస్టేషన్‌కు ర్యాలీగా వచ్చి ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ జి.వెంకటేష్ చెప్పారు.



కోనసాపపేట రామాలయం ఆవరణలో సమావేశంలో ఘర్షణపడుతున్న మత్స్యకారులు

మహిళా హోంగార్డుతో అసభ్య ప్రవర్తన

- బొమ్మూరు హెడ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

రాజమహేంద్రవరంసిటీ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంరూరల్ మండలం బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ప్రసాద్‌ను అధికారులు సస్పెండ్ చేశారు. వివరాల్లోకి వెళితే.. పోలీస్ స్టేషన్‌లో నాలుగున్నరేళ్లుగా హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తు న్న ప్రసాద్ ఈనెల 8న రాత్రి విధులు నిర్వర్తిస్తుండగా బయట రౌండ్స్‌కు వెళ్లి తిరిగి అతను తెల్లవారుజామున 2:30కు మద్యంమత్తులో పోలీ స్టేషన్‌కు వచ్చి అక్కడ విధుల్లో ఉన్న మహిళా హోంగార్డుపట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో భయపడి ఇంటికి వెళ్లిపోయిన ఆమె తన భర్తకు విషయంచెప్పి అతన్ని తీసుకుని వచ్చి బొమ్మూరు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ దృష్టికి సమస్యను వివరించడంతో ఆయన ఆదేశాల మేరకు గురువారం ప్రసాద్‌పై కేసు నమోదుచేసి అతన్ని సస్పెండ్ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్.యానాంలో ఈనెల 27 నుంచి..

సీనియర్ నేషనల్ ఉమెన్స్ బీచ్ వాలీబాల్ పోటీలు



అమలాపురం పీఆర్ అతిథిగృహంలో అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురంటౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎస్.యానాం బీచ్‌ను భవిష్యత్‌లో ఎంతగానో అభివృద్ధి చేసే లక్ష్యంతో ఈనెల 27 నుంచి మూడు రోజుల పాటు సీనియర్ నేషనల్ లెవెల్ ఉమెన్స్ బీచ్ వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రకటించారు. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో డే అండ్ నైట్ మ్యాచ్‌లను నిర్వహించే విధంగా చేయాల్సిన ఏర్పాట్లపై జిల్లా విద్యాశాఖాధికారి, వ్యాయామ ఉపాధ్యాయులు, వాలీబాల్ పోటీల నిర్వహణ కమిటీ సభ్యులతో గురువారం అమలాపురం పంచాయతీరాజ్ అతిథిగృహంలో ఆనందరావు సమావేశం నిర్వహించారు. బీచ్ వాలీబాల్ పోటీల్లో భాగంగా శుక్రవారం ఉదయం భూమిపూజా కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ పోటీల్లో ప్రధానంగా ఎనిమిది జట్లు పాల్గొంటాయని ఆర్గనైజింగ్ కార్యదర్శి గొలకోటి ఫణీంద్రుమార్ తెలిపారు. టోర్నమెంట్‌ను విజయవంతం చేసేవిధంగా వ్యాయామ ఉపాధ్యాయులందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకుడు పీఎస్ సురేష్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు ఉండ్రు ముసలయ్య, కామన గణేష్, కె.ఈశ్వరరావు, ఎం.రామారావు, మూర్తి పాల్గొన్నారు.

వసతిగృహంలో మద్యం బాటిళ్లతో బీభత్సం

- ఇద్దరు వ్యక్తుల అరెస్టు

పిఠాపురం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): వసతిగృహంలోకి మద్యంమత్తులో బీరుబాటిల్స్ పగులగొట్టి బీభత్సం సృష్టించి విద్యార్థులను బెదిరించి డబ్బులు లాక్కొని పరారైన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. పిఠాపురం సీఐ శ్రీనివాస్, పట్టణ ఎస్‌ఐ మణికుమార్‌లు గురువారం ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పిఠాపురం పట్టణంలోని సాంఘిక సంక్షేమశాఖ బాలుర వసతిగృహంలోకి ఈనెల 9వ తేదీ అర్ధరాత్రి సమయంలో ఇద్దరు వ్యక్తులు మద్యంమత్తులో ఉండి వెనుకవైపు నుంచి లోపలకు ప్రవేశించారు. 8,9,10 తరగతుల విద్యార్థులను బెదిరించి అక్కడే బీరు బాటిల్స్ పగులగొట్టి పొడిచి చంపుతామంటూ భయబ్రాంతులకు గురిచేశారు. వారి వద్దన ఉన్న రూ.540ను లాక్కొని పరారయ్యారు. దీనిపై వసతిగృహ సంక్షేమాధికారి చేసిన ఫిర్యాదు మేరకు పిఠాపురం పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సంఘటనకు పాల్పడిన రథాలపేటకు చెందిన పూడి గంగాధర్ అలియాస్ బాలు, కుమారపురం గ్రామానికి చెందిన గుబ్బల దయానందపాల్‌లను గురువారం అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచారు. వీరిపై రౌడీషీట్లు తెరుస్తున్నట్లు సీఐ తెలిపారు. వసతిగృహాలు, పాఠశాలలు, కళాశాలలు వద్ద అలజడులు సృష్టించే వారు, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



బాలుర వసతి గృహంలో విద్యార్థులను భయబ్రాంతులకు గురిచేసిన వారిని అరెస్టు చూపుతున్న సీఐ, ఎస్‌ఐలు

ఆర్‌పీఎఫ్ అదుపులో 8మంది బాలలు



బాలలను అదుపులోకి తీసుకున్న ఆర్‌పీఎఫ్ పోలీసులు

రాజమహేంద్రవరంసిటీ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): వివిధ పనుల నిమిత్తం బీహార్, వెస్ట్‌బెంగాల్ రాష్ట్రాల నుంచి ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తున్న 8మంది బాలలను రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో ఆర్‌పీఎఫ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం ఐపీఎఫ్ బి.సైదయ్య, ఏఎస్‌ఐపీఎఫ్ పి.సత్యనారాయణ, హెచ్‌సీ ఆర్.బాహూజీ, జి.అప్పారావు, కానిస్టేబుల్స్ జె.నారాయణ, కె.మురళీ, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ డీసీపీయూ జి.తిరుపతిరావు, స్టేట్ కోఆర్డినేటర్ బి.చంద్రశేఖర్, ఏపీవో కె.శ్రీకాంత్ రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో శాలీమార్ టూ హైదరాబాద్ వెళ్లే ఈస్ట్‌కోస్టు ఎక్స్‌ప్రెస్‌లో ఈ బాలలను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారిని సామర్లకోట, రాజమండ్రి, విజయవాడ, సికింద్రాబాద్‌లలో పనుల నిమిత్తం బీహార్‌కు చెందిన ఏజెంట్లు దిన సహాని, దీపక్‌కుమార్, హీరా షైక్, లాలాన్‌కుమార్ తరలిస్తున్నారని పోలీసులు తెలిపారు. ఏజెంట్లను అదుపులోకి తీసుకుని బాలల తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చినట్టు చెప్పారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

రాజానగరం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలో 2020లో జరిగిన కొంతమూరుకు చెందిన తోట కనకదుర్గ హత్యకేసులో నిందితుడు నరసింహరాజుకు కోర్టు జీవిత ఖైదు, రూ.2 వేలు జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరంలోని 5వ సెషన్స్‌జడ్జి కోర్టులో జడ్జి డబ్బిరి విజయ్‌గౌతం తీర్పు ఇచ్చారని రాజానగరం పోలీస్‌లు గురువారం తెలిపారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ శంభుప్రసాద్, పీపీ లక్ష్మణ్‌నాయక్ వాదనలు వినిపించగా కోర్టు కానిస్టేబుల్ దుర్గాప్రసాద్ సహకరించారన్నారు.

వెంకన్న ఆదాయం రూ.2.76లక్షలు

ఆత్రేయపురం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. స్వామివారికి అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణాలు నిర్వహించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,76,434 లభించినట్టు ఈవో తెలిపారు.

బాధిత కుటుంబానికి చైర్మన్ పరామర్శ

పి.గన్నవరం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉడిమూడి శివారు చింతావారిపేటలో జరిగిన కారు ప్రమాదంతో మృతిచెందిన వారి కుటుంబ సభ్యులను జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు గురువారం పరామర్శించారు. సర్పంచ్ వడలి కొండయ్య, యన్నాబత్తుల ఆనంద్, దొమ్మేటి దుర్గారావు, పుచ్చకాయల నరసింహమూర్తి పాల్గొన్నారు.

శిథిలస్థితికి చేరిన ఆర్అండ్‌బీ అతిథి గృహం

- బిల్లులు చెల్లించకపోవడంతో విద్యుత్ సరఫరా నిలిపివేత
- భవనం ఆధునికీకరణకు రూ.30లక్షలతో ప్రతిపాదనలు




మామిడికుదురులో రోడ్డు భవనాలశాఖ అతిథిగృహం, అతిథిగృహం గోడలపై మొలిచిన మొక్కలు

మామిడికుదురు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మామిడికుదురులోని రోడ్డు, భవనాల శాఖ అతిథిగృహం భూత్ బంగళాగా మారి నిరుపయోగంగా తయారైంది. జాతీయ రహదారి 216 ప్రక్కన గల ఈభవనాన్ని ఎవరూ పట్టించుకోకపోవడంతో భవనం గోడలపై పిచ్చిమొక్కలు మొలిచి శిథిలస్థితికి చేరే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈభవనానికి తాగునీరు లేకపోవడం వల్ల ఉపయోగించడం లేదు. విద్యుత్ బకాయిలు చెల్లించకపోవడంతో సంబంధిత శాఖవారు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. గత ప్రభుత్వం పూర్తిస్థాయిలో భవనాన్ని విస్మరించడంతో భవనంలో గల మంచాలు, ఏసీలు ఎందుకూ పనికిరాకుండా పోయాయి. ప్రజాప్రతినిధులు , సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం వల్ల రూ.లక్షలు ఖర్చుచేసి నిర్మించిన భవనం ఎందుకూ పనికిరాకుండా పోయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. వాచ్‌మెన్ లేకపోవడంతో ఈభవనం అపరిశుభ్ర వాతావరణం మధ్య ఎందుకూ పనికిరాకుండా తయారైంది. దీనిపై సంబంధిత ఏఈ సురేష్‌ను వివరణ కోరగా భవనం ఆధునికీకరణకు రూ.30లక్షలతో ప్రతిపాదనలు రూపొందించి టెండర్లు పిలవడం జరిగిందని, ఎవరూ ముందుకు రాకపోవడంతో కార్యరూపం దాల్చలేదని తెలియచేశారు. ఇప్పటికైనా రూ.లక్షలు విలువ చేసే భవనాన్ని ఆధునికీకరించి అందరికీ ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

చలో గుంటూరును విజయవంతం చేయాలి

- ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ.. 15న హలో మాల.. చలో గుంటూరు



ఈదరపల్లిలో దళిత నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న కన్వీనర్ బాబూరావు

అమలాపురంరూరల్, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ ఈనెల15న గుంటూరు నల్లపాడు వద్ద చేపట్టే మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని దళిత నాయకుడు, కన్వీనర్ జంగా బాబూరావు పిలుపునిచ్చారు. ఈదరపల్లిలో బాబూరావు అధ్యక్షతన దళిత నాయకుల సమావేశం గురువారం నిర్వహించారు. తొలుత సీనియర్ నాయకుడు డీబీ లోక్ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. చుండూరు, కారంచేడు వంటి ప్రాంతాల్లో సంఘటనలు జరిగినప్పుడు కృష్ణమాదిగ ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు తీర్పుపై దేశ వ్యాప్తంగా ఉద్యమాలు మొదలయ్యాయని ఇప్పటికే సుప్రీంకోర్టు తీర్పును పునఃసమీక్షించాల్సిన పరిస్థితి వచ్చిందని బాబూరావు పేర్కొన్నారు. 15న గుంటూరులో జరిగే హలో మాల.. చలో గుంటూరు మాలల మహాగర్జన సభలో కీలక నిర్ణయాలు తీసుకుంటామని సీనియర్ నాయకుడు ఇసుకపట్ల రఘుబాబు చెప్పారు. భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికను నిర్ణయించడంతో పాటు దశలవారీ ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. జిల్లా నుంచి బయలుదేరే వాహనాలన్నీ కోనసీమ ముఖ ద్వారమైనరావులపాలెం సెంటర్ మీదుగా ఈతకోట హైవే మీదకు చేరుకునేలా ప్రణాళికలు రూపొందించారు. జిల్లా నలుమూలల నుంచి ప్రజాప్రతినిధులు, ఉద్యమ నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రేవు తిరుపతిరావు, కోట రామ్మోహనరావు, గెడ్డం సురేష్‌బాబు, గొల్లపల్లి డేవిడ్, బడుగు జేమ్స్‌పాల్, నెల్లి లక్ష్మీపతి, పొలమూరి మోహన్ బాబు,నల్లా నరసింహమూర్తి, చింతా రాజబాబు, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, ఊటాల ఉదయ్‌కుమార్, అయితాబత్తుల సుభాషిణి, కొంకి రాజామణి, పుణ్యమంతుల రజనీమాట్లాడారు.

రూ.50కోట్లతో ఎస్.యానాం అభివృద్ధి ప్రణాళిక



ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆనందరావును సన్మానిస్తున్న దృశ్యం

డిసెంబరు నెలాఖరులో బీచ్ వాలీబాల్ పోటీలు

ఉప్పలగుప్తం, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంత గ్రామం ఎస్.యానాం అభివృద్ధికి రూ.50కోట్లతో ప్రణాళిక రూపొందిస్తున్నట్టు అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రకటించారు. సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఎమ్మెల్యేకు ఘన సన్మానం జరిగింది. కమిటీ చైర్మన్ పినిశెట్టి నరసింహారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వగ్రామంలో దేవుని సమక్షంలో సన్మానించడం తన అదృష్టమన్నారు. ఎస్.యానాంను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడం ద్వారా వందల మందికి ఉపాధి కల్పన సాధ్యమవుతుందన్నారు. త్వరలోనే రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో బీచ్‌ను ప్రారంభించే ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. డిసెంబరు ఆఖరి వారంలో బీచ్‌లో జాతీయ మహిళా వాలీబాల్ పోటీలు నిర్వహిస్తామన్నారు. వచ్చే ఏడాది జనవరిలో తెలుగు సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా బీచ్‌లో సంక్రాంతి ఉత్సవాలు జరుపుతామన్నారు.ఈసమావేశంలో అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ అల్లాడి స్వామినాయుడు(సోంబాబు)ను ఉత్సవ కమిటీ సన్మానించింది. సమావేశంలో కూటమి నాయకులు కల్వకొలను తాతాజీ, నల్లా శ్రీధర్, దంగేటి చిట్టిబాబు, పలచోళ్ల పద్మనాభం, సర్పంచ్ జోగి రాజేశ్వరీరాజా, ఇసుకపట్ల రఘుబాబు, అరిగెల నానాజీ, దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, పలచోళ్ల బుజ్జి, మేకల దొరబాబు, సత్తి చిన్నా, మేకల నానాజీ, పినిశెట్టి అబ్బు, లంకే భీమరాజు, చీకట్ల శ్రీను, పినిశెట్టి సురేష్, పి.రంగారావు, దంగేటి సుబ్రహ్మణ్యం, ఆకుల సూర్యనారాయణమూర్తి, ఉలిశెట్టి దొరబాబు, నల్లా పవన్, మంచెం బాలకృష్ణ, దెందుకూరి సత్తిబాబురాజు, గునిశెట్టి చినబాబు, రవణం మధు, కంచిపల్లి అబ్బులు, లింగోలు పండు, ఆకుల బుజ్జి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పి.గన్నవరం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరంలో 33కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల పనులు నిమిత్తం నరేంద్రపురం సబ్‌స్టేషన్ పరిధిలోని నరేంద్రపురం, కుందాలపల్లి, రాజులపాలెం, గంటిపెదపూడి, ఉడిమూడి, ఉడి మూడిలంకలు, బెల్లంపూడి, యర్రంశెట్టి వారిపాలెం గ్రామాలకు ఉదయం 10నుంచి 4గంటలు వరకు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.రవికుమార్ తెలిపారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): నగరం సబ్‌స్టేషన్ పరిధిలోశుక్రవారం 10నుంచి 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం. రవికుమార్ తెలిపారు. కొత్తలైను ఏర్పాటుకోసం నగరం కొత్తరోడ్డు నుంచి జగన్నపేట సెంటర్ వరకు, జగ్గన్నపేట సెంటర్, మొగలికుదురు గ్రామాల్లో సరఫరా ఉండదన్నారు.

కాట్రేనికోన, (ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. ఉదయం 8నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు మండలంలోని అన్ని గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి):ఉప్పలగుప్తం, చల్లపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో నిర్వహణ పనులు చేపట్టనున్నట్టు అమలాపురం ట్రాన్స్ కో ఈఈ ఎం. రవికుమార్ తెలిపారు. ఈ కారణంగా మండలంలోని అన్ని గ్రామాలకు శుక్రవారంఉదయం 8నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభినందనలు

అమలాపురం రూరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): కోనసీమ దేవాంగ సంక్షేమ సంఘ అధ్యక్షుడిగా పనిచేస్తున్న అమలాపురం మాజీ ఎంపీపీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఇటీవల రాష్ట్ర సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్వామిని మాజీ జడ్పీటీసీ చింతా శంకర మూర్తి, చింతా అత్తిలింగం, సొసైటీ మాజీ అధ్యక్షుడు చందన శంకరరావు, యినుమర్తి లింగమూర్తి, చింతపట్ల గంగాసత్యనారాయణ, చింతా శ్యామ్ జాదూగర్ అభినందించారు.

టీడీపీ హయాంలోనే రైతు సంక్షేమం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

ఐ.పోలవరం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): టీడీపీ హయాంలోనే రైతులకు సంక్షేమం చేకూరుతుందని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. గురువారం మురమళ్ల క్యాంపు కార్యాలయంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో సాగునీటి సంఘాల ఎన్నికలపై సమీక్ష నిర్వహించారు. ఈనెల14న జరిగే ఎన్నికల్లో కూటమి నాయకులు పరస్పర సహకారంతో వ్యవహరించాలని సూచించారు. గతంలో దేశం హయాంలో నీటి సంఘాల ఆధ్వర్యంలో నీరు-చెట్టు పథకం ద్వారా రైతులకు ప్రయోజనం జరిగిందన్నారు. రైతులకు సేవలందించే ప్రతినిధులను ఎన్నుకోవాలన్నారు. ఐ.పోలవరం, గుత్తెనదీవి, కేశనకుర్రు, కొమరగిరి సంఘాలకు ఎన్నికలు జరగనున్న సందర్భంగా గ్రామాల వారీగా కూటమి నాయకులతో చర్చించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, సాగిరాజు సూరిబాబురాజు, కాకర్ల పూడి రాజేష్, పెంట రవి, కొండమూరి విజయబాబు, సాకా సీతాదేవి, బీర సత్యకుమారి, సాగిరాజు వాసురాజు, ముదునూరి రామలింగరాజు, ముదునూరి అర్జునరాజు, బొంతు శ్రీరాములు, చిలువూరి సుబ్బరాజు, గాదిరాజు సత్తిబాబురాజు, కలిదిండి ఎక్కిరాజు, ముదునూరి లింగరాజు, గంజా సుధాకర్, చెయ్యేటి శ్రీనుబాబు, మల్లిపూడి రాజా, మద్దిరెడ్డి కుమార్ పాల్గొన్నారు.

ఎన్నికలపై సిబ్బందికి అవగాహన

పి.గన్నవరం, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): రేపు జరగనున్న నీటి సంఘాల ఎన్నికలపై సిబ్బందికి అవగాహన కల్పించినట్లు ఎంపీడీవో కేవీ ప్రసాద్ తెలిపారు. గంటిపెదపూడి నీటి సంఘం ఎన్నికల నేపథ్యంలో ఉడిమూడిలో సిబ్బందితో నిర్వహించిన అవగహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 14వతేదీ ఉదయం 9గంటలకు ఎన్నికలు ప్రారంభమవుతాయని టీసీ నెం బర్లు ఎన్నిక పూర్తయిన తరువాత మధ్యాహ్నం 3నుంచి 5గంటలు వరకు నీటి వినియోగదారుల సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక నిర్వహిస్తా మ న్నారు. ఆయాఅంశాల్లో సిబ్బంది అనుసరించాల్సిన విధానాలపై ఎంపీడీవో వివరించారు. ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకనకముత్యాలమ్మ తీర్థ మహోత్సవాలు

అంతర్వేది, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేశవదాసుపాలెం-అంతర్వేది గ్రామాల్లో వెలసి ఉన్న శ్రీకనకముత్యాలమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా గురువారంతో తీర్థ మహోత్సవాలు వైభవంగా ముగిశాయి. మూడు రోజులు అమ్మవారు గ్రామోత్సవాలు ముగించుకుని ఆలయానికి చేరుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి గరగలు సమర్పించారు. అనంతరం ఇరు గ్రామాల ఆడపడుచులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఉదయం నుంచి రాత్రి వరకు అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. సాయంత్రం ఆలయం వద్ద సిరిబొమ్మ మహోత్సవం నిర్వహించారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

ఆక్రమణలను తొలగించండి

ఉప్పలగుప్తం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): కిత్తనచెరువులో సర్వే నెం.607లో పేదలకు ఇళ్ల స్థలాల కోసం భూమి కేటాయించిన సమయంలో సబ్‌డివిజన్ చేయకపోవడం వల్ల భూఆక్రమణలు ఊపందుకున్నాయని గ్రామానికి చెందిన చిల్లా పురుషోత్తం, బండారు వెంకటేశ్వరరావు గురువారం భీమనపల్లి రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేశారు. కొందరు తమకిచ్చిన భూమి కంటే ఎక్కువ విస్తీర్ణంలో పట్టాలు సృష్టించుకున్నారని సదస్సులో పాల్గొన్న అమలాపురం ఆర్డీవో కె.మాధవికి విన్నవించారు. రోడ్డుకు కేటాయించిన భూమిని కూడా ఆక్రమించుకుని భవనాలు నిర్మించుకున్నారని ఆరోపించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సదస్సులో సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్, తహసీల్దార్ వాసా దివాకర్, రెవెన్యూ ఉద్యోగులుపాల్గొన్నారు.

జిల్లాలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి

మామిడికుదురు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీని జిల్లాలో బలోపేతానికి ప్రత్యేక కృషిచేస్తున్నామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. గురువారం నగరం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా కమిటీ నిర్మాణం అనుబంధ, మండల కమిటీల ఏర్పాటు గురించి దిశా నిర్దేశం చేశారు. పార్టీ బలోపేతానికి ప్రతీ నాయకుడు, కార్యకర్త కృషిచేసి పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని కోరారు. కొత్తూరి శ్రీను, మహ్మద్ ఆరిఫ్, అయితాబత్తుల సుభాషిణి, మాచవరపు శివన్నారాయణ, అప్పన శ్రీరామకృష్ణ, నీతిపూడి బాలసత్యనారాయణ, బొంతు రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

అన్నదాతలను వణికిస్తున్న వాతావరణం



ఎస్.మూలపొలంలో ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

అయినవిల్లి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. అకాల వర్షాలు కురుస్తుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పంటలను రక్షించుకునే ప్రయత్నాల్లో రైతులు నిమగ్నమయ్యారు. మండలంలో 8,200ఎకరాల్లో రైతులు సార్వాసాగు చేశారు. మండలంలో 50శాతం వరి కోతలు పూర్తయ్యాయి. వర్షాలకు పంట నేటనంటడంతో పెట్టుబడి రెట్టింపు అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోసిన ధాన్యాన్ని ఆరబెట్టుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

మల్లాడి పరామర్శ

యానాం, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): కనకాలపేటలో ఐఆర్‌బీఎన్ కానిస్టేబుల్ కనకాల లోవరాజు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. అగ్నిప్రమాదంలో కొన వెంకన్నబాబుకు చెందిన తాటాకు ఇల్లు దగ్ధమైంది. లోవరాజు కుటుంబ సభ్యులను, అగ్నిప్రమాద బాధిత కుటుంబసభ్యులను డిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పరామర్శించారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ

అమలాపురం టౌన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో నిర్వహించిన 18వ ఏపీ స్టేట్ ఇన్విటేషనల్ కరాటే చాంపియన్ షిప్-2024 పోటీల్లో అమలాపురం సహస్ర ఇంటర్నేషనల్ స్కూలు విద్యార్థులు ప్రతిభ చాటి పతకాలు సాధించారు. వెయ్యి మందికి పైగా విద్యార్థులు ఈపోటీల్లో పాల్గొన్నారు. అండర్-9 నుంచి అండర్-14 విభాగాల్లో పాఠశాలకు చెందిన సీహెచ్ వినీషసుసత్య, జి.లాస్యశ్రీసాయి స్వర్ణ పతకాలు సాధించారు. ఎ.రామారావు రజత పతకం దక్కించుకోగా ఎం.మహేష్, జి.సాత్విక్, క్రిస్టీనా, బి.కుందనలక్ష్మిఅనసూయ, ఎ.నవ్యతులసి కాంస్య పతకాలు దక్కించుకున్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను స్కూల్ డైరెక్టర్ రవణం వేణుగోపాల్, ప్రిన్సిపాల్ గౌసియా బేగం, కోచ్ రవి అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రాజోలు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): సోంపల్లి శివాలయం సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరుకు చెందిన కె.బాబి, పి.గన్నవరం మండలం వాడ్రేవుపల్లికి చెందిన పితాని వరుణ్ బైక్స్ సోంపల్లి శివాలయం సమీపంలో ఢీకొన్నాయి. బాబికి తలకు తీవ్ర గాయమైంది. వరుణ్ కు ఎడమ చేయి విరిగింది. స్థానికులు వార్ని108లో రాజోలు ప్రభుత్వాసు పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బాబిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఉత్సాహంగా భాష్యం అంతర్గత క్రికెట్ లీగ్ పోటీలు

అమలాపురం టౌన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల్లోని భాష్యం విద్యా సంస్థల అంతర్గత క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలు అమలాపురం బాలయోగి స్టేడియంలో నిర్వహించారు. అమలాపురం, ముమ్మిడివరం, కొత్తపేట, రావులపాలెం, మండపేట, పాలకొల్లు, నర్సాపురం, తాటిపాక, మలికిపురం శాఖల నుంచి 270మంది సీనియర్, జూనియర్ విద్యార్థులు క్రికెట్ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు బహుమతి ప్రదానోత్సవ సభ భాష్యం జోనల్ ఇన్‌చార్జి జవ్వాది వెంకటశ్రీనివాస్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్, ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ కె.సత్యరేవతి బహుమతులు అందజేశారు. విజేతలను భాష్యం విద్యా సంస్థల అధినేత భాష్యం రామకృష్ణ, వైస్‌చైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్‌రామ్ అభినందించారు.

టీడీపీ నాయకుడికి ఎమ్మెల్యే పరామర్శ



శేషహనుమంతలక్ష్మికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

ఉప్పలగుప్తం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): చల్లపల్లికి చెందిన సీనియర్ తెలుగుదేశం నాయకుడు దంగేటి రవీంద్రనాథ్ (బాబు) మాతృమూర్తి శేషహనుమంతలక్ష్మి ఇటీవల మృతి చెందారు. గురువారం జరిగిన సంతాప సమావేశంలో అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పాల్గొని లక్ష్మి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నిమ్మకాయల చెల్లయ్యానాయుడు, పోలిశెట్టి శివాజీ, గొలకోటి చిన్నా, దంగేటి బాబులు, ఏవీ కృష్ణారావు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు విద్యార్థులు వారధి

అమలాపురంటౌన్, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి సంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు అందించే వారధిగా విద్యార్థులు నిలుస్తారని అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ అన్నారు. అమలాపురం యర్రమిల్లి వారి వీధిలోని హనుమాన్ మందిర్ వద్ద నిర్వహించిన 19వ భారతీయ సంస్కృతి ఉత్సవ్ బహుమతి ప్రదానోత్సవ సభ గురువారం ఆకొండి సింహాచలం సర్వీసు ట్రస్టు చైర్మన్ ఆకొండి పవన్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. సంస్కృతి ఉత్సవ్‌లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 200మందికి పైగా పాల్గొన్నారు. వీరిలో వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు డీఎస్పీ ప్రసాద్, పవన్‌కుమార్ బహుమతులు, షీల్డులు అందజేశారు. వివిధ అంశాల్లో తర్ఫీదునిచ్చిన అధ్యాపకులకు సుదర్శన్ ది ఐడియల్ టీచర్ అవార్డులను అందజేశారు. ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

మామిడికుదురు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మామిడికుదురులోని మహిమ స్వస్థత వర్తశాలలో క్రిస్మస్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పాదర్ ప్రభుదాస్ ఆధ్వర్యంలో న్యూపరిశుద్ధ బైబిల్ మినిస్ట్రీస్ నిర్వహించిన గ్రాండ్ క్రిస్మస్ వేడుకల్లో అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు. నగినేటిపల్లికి చెందిన పాదర్ బి.మలాకీ క్రిస్మస్ సందేశాన్ని భక్తులకు వివరించారు. ఈసందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం జరిగిన ప్రేమ విందులో అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు



రాజోలు: పొన్నమండ సదస్సులో మాట్లాడుతున్న తహశీల్దార్ ఎన్ఎస్ఎస్ ప్రసాద్

మామిడికుదురు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): భూసంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని మండల ప్రత్యేకాధికారి ఎస్డీసీ రామ్మోహనరావు తెలిపారు. మామిడికుదురులో గురువారం రెవెన్యూ సదస్సు జరిగింది. సమస్యలు పరిష్కరించాలంటూ తహశీల్దార్ ఆచార్యులుకు పలువురు రైతులు అర్జీలు సమర్పించారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని అధికారులకు తహశీల్దార్ ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, ఎంపీటీసీలు నయినాల సీతామహాలక్ష్మి, వర్థినేని తులసీరామ్, వీఆర్వోలు శ్రీనివాస్, త్రిమూర్తులు, స్థానిక నాయకులు ఈలి శ్రీనివాస్, మట్టా సత్తిబాబు, రుద్ర శ్రీను, యింటి మహేంద్ర పాల్గొన్నారు.

సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

మలికిపురం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ టి.శ్రీనివాసరావు అన్నారు. 1923లో ఏ-రిజిస్టర్ ఏర్పడి వందేళ్లు అయిందని, రీసర్వే ద్వారా కొత్త రిజిస్టర్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. భవిష్యత్‌లో సరిహద్దు సమస్యలు లేకుండా గ్రామాల్లో రీసర్వే ద్వారా హద్దులను నిర్ణయిస్తామన్నారు. రీ సర్వే ద్వారా కచ్చితమైన భూసమాచారం అందుబాటులోకి వస్తుందన్నారు. గుడిమెళ్లంకలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 130మంది రైతులు సమస్యలపై దరఖాస్తులు అందజేశారు. సర్పంచ్ నల్లి విజయకుమారి, ఎంపీటీసీ నల్లి అంజలి, ముత్యాల సాయిరామ్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో 186 దరఖాస్తులు

రాజోలు,డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): పొన్నమండ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద తహశీల్దార్ ఎన్ఎస్ఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు గురువారం నిర్వహించారు. స్పెషల్ ఆఫీసర్, డీఎల్పీవో పి.బొజ్జిరాజు రెవెన్యూ సదస్సుకు హాజరయ్యారు. రెవెన్యూ శాఖకు 18, రేషన్‌కార్డుల కోసం 54, గృహ నిర్మాణం కోసం 38, పెన్షన్ల కోసం 55, పొజిషన్ సర్టిఫికెట్ కోసం 21 మొత్తం 186 దరఖాస్తులు వచ్చాయన్నారు.సర్పంచ్ కుక్కల బేబికుమారి, డిప్యూటీ తహశీల్దార్ సీఎస్ రాజు, వీఆర్వోలు, సెక్రటరీలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

కాలనీల్లో చెట్లను తొలగించి రహదారులు నిర్మించాలి

అంబాజీపేట, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): కె.పెదపూడిలోని కృష్ణదేవరాయుడు, మేనకేశ్వరస్వామి కాలనీలో ఉన్న చెట్లను తొలగించి రహదారులు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. కె.పెదపూడిలో తహశీల్దారు జె.వెంకటేశ్వరి ఆధ్వర్యంలో రెవెన్యూసదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా పలుకాలనీలను రెవెన్యూ అధికారులు సందర్శించారు. దీంతో స్థానికంగా ఉన్న కాలనీ వాసులు తహశీల్దారుకు పలు సమస్యలు వివరిం చారు. కాలనీలు ఏర్పడి ఏళ్లు గడుస్తున్న సరైన రహదారులు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. సదస్సులో 27అర్జీలు వచ్చినట్లు తహశీల్దారు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ కె.ఏడుకొండలు, పంచాయతీ కార్యదర్శి బి.అప్పారావు, నాయకులు పెదపూడి శ్రీనివాసరావు, నేదునూరి పెద్దిరాజు పాల్గొన్నారు.

ఆలయ ప్రతిష్టను పెంపొందించేందుకు కృషి చేయాలి



బాలబాలాజీ స్వామి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

మామిడికుదురు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ ఆలయ ప్రతిష్టను పెంపొందించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కోరారు. గురువారం ఆయన దేవస్థానంలో బాలబాలాజీ స్వామి ఆలయం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ముందుగా ఎమ్మెల్యే బాలబాలాజీని దర్శించుకోగా ఆయనకు ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవస్థానానికి వచ్చే భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు రాకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో జాలెం శ్రీనివాసరాజా, అడబాల తాతకాపు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, కంకిపాటి నరసింహారావు, తుండూరి బుజ్జి, తులా బ్రహ్మాజీ, కూటమి నాయకులు, ఆలయ ఏసీ ఎం. సత్యనారాయణరాజు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రోన్ పైలట్ శిక్షణా శిబిరం ఏర్పాటు

కాట్రేనికోన, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): చెయ్యేరు శ్రీశ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో అకిన్ అనలిటిక్స్ సంస్థ డ్రోన్ పైలట్ శిక్షణా శిబిరం ఏర్పాటు చేసింది. ఈసందర్భంగా భద్రత, అర్హతా ప్రమాణాల పరిశీలనకు గురువారం డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ డీజీసీఏ బృందం వచ్చింది. ఇక్కడి పరిస్థితులను బృందం అధ్యయనం చేసింది. కరస్పాండెంట్ డీవీఎస్ఎస్ వర్మ, ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసకుమార్, శ్రీసందీప్ పాల్గొన్నారు.

స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్య సాధనకు కృషి చేయాలి

అల్లవరం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్ణయం మేరకు స్వర్ణాంధ్రప్రదేశ్-2047 లక్ష్య సాధనకు కృషి చేయాలని ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ అన్నారు. అల్లవరం మండల పరిషత్‌లో పంచాయతీ కార్యదర్శులతో గురువారం సమావేశం జరిగింది. హౌస్‌హోల్డ్ ఇమేజ్ క్యాప్చర్ సర్వే తదితర అంశాల్లో నూరుశాతం ప్రగతి సాధించాలన్నారు. అల్లవరంలో బాల్య వివాహాన్ని అడ్డుకున్న పంచాయతీ సిబ్బందిని ఎంపీడీవో అభినందించారు. పంచాయతీ కార్యదర్శులు ఎస్.రాజమోహన్, సాయిబాబు, డి.వీరబాబు, మల్లాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీపీఏ గౌరవ సలహాదారు చిక్కం మృతి



ఉప్పలగుప్తం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్ల అసోసియేషన్ గౌరవ సలహాదారు ఉప్పలగుప్తం గ్రామానికి చెందిన చిక్కం సూర్యనారాయణ అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతికి అసోసియేషన్ అధ్యక్షునితో పాటు కార్యవర్గ సభ్యులు సంతాపం తెలిపారు.

ఆర్థిక సహాయం

మలికిపురం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు సహకారంతో ఎనిమిది మందికి రూ.95వేలు గురువారం మలికిపురంలో జంపన బుజ్జిరాజు ఇంటి వద్ద అందజేశారు. పి.శేషప్రసాద్‌కు రూ.20వేలు, ఎ.శాంతకుమారికి రూ.15వేలు, జి.భద్రాచలంకు రూ.10వేలు, రాంబాబుకు రూ.10వేలు, యు.కామేశ్వరరావుకు రూ.10వేలు, షేక్ రంజానీకి రూ.10వేలు, ఎం.పెద్దిరాజుకు రూ.10వేలు, ఎం.దత్తాత్రేయకు రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో బోనం రాజు, జంపన బుజ్జిరాజు, అల్లూరి మధురవిరామరాజు తదితరులు పాల్గొన్నారు.

చలి నుంచి చిన్నారులకు రక్షణ కల్పిద్దాం

మలికిపురం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలోని ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు సరైన సౌకర్యాలు లేక చలికి ఇబ్బందులు పడుతున్నారని, వారికి ఆర్థిక సహాయం అందజేసి సౌకర్యాలు కల్పిద్దామని మానవతా సంస్థల గ్రూపు పిలుపుఇచ్చింది. వివిధ హాస్టళ్లలో విద్యార్థులు నిద్ర పోవడానికి మంచాలు, పరుపులు లేవన్నారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పిల్లల పరిస్థితిని చూసి కొంత మంది దాతల సహకారంతో పరుపులు, దుప్పట్లు అందించారు. మిగిలిన హాస్టళ్లలో సౌకర్యాల లేమిపై దాతలు ముందుకు వచ్చి సహకరించాలని మానవతా గ్రూపుల సంస్థ సభ్యులు బోరం రాజు, సాధనాల విజయ్‌లు పిలుపునిచ్చారు.

అందరూ దైవభక్తిని పెంపొందించుకోవాలి

ఐ.పోలవరం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ దైవభక్తిని పెంపొందించుకున్నప్పుడే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. కొమరగిరికి చెందిన టీడీపీ నాయకుడు జంపన రాంభద్రరాజు, లక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో గురువారం జరిగిన పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సత్యనారాయణ వ్రతం, గోదానం వంటి పూజలు నిర్వహించారు. రాంభద్రరాజు దంపతులను ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

అన్నివర్గాల ప్రజలకు చమురు పరిహారం అందించాలి

యానాం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రిలయన్స్, ఓఎన్జీసీ సంస్థలు మత్స్యకారులకు ఇస్తున్న పరిహారం మాదిరిగానే అర్హులైన అన్నివర్గాల (పేదలకు) ప్రజలకు పరిహారం చెల్లించాలని కాంగ్రెసు నాయకులు ములగపాటి ప్రసాదరాజు, చీకట్ల రామకృష్ణా కోరారు. స్థానిక దొబి స్ట్రీట్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. యానాంలో మత్స్యకారులకు మాత్రమే చమురు సంస్థలు పరిహారం చెల్లిస్తున్నాయని, మిగిలిన వర్గాలకు పరిహారం చెల్లించడంలేదన్నారు. సమీప ప్రాంతాలకు చెందిన అన్నివర్గాలకు నష్టం వాటిల్లుతున్న నేపథ్యంలో పరిహారం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. నాయకులు దున్న చక్రవర్తి, పిన్నమరాజు వెంకటసుబ్బరాజు పాల్గొన్నారు.

బీవీసీలో నెహ్రూ యువ కేంద్ర యువ ఉత్సవ్ మేళా

అల్లవరం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): యువజన సర్వీసులు, క్రీడామంత్రిత్వశాఖ, కోనసీమ జిల్లా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వ ర్యంలో యువ ఉత్సవ్ మేళా ఘనంగా జరిగింది. ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో సైన్సు మేళా, ఎగ్జిబిషన్, చిత్రలేఖనం, కవిత్వం, ఫొటోగ్రఫీ, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రతి విద్యార్థి బాధ్యతగా మెలిగి దేశప్రతిష్టను పెంచేలా ప్రముఖ పాత్ర వహించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు అన్నారు. బీవీసీ అధినేత బోనం కనకయ్య, చైర్మన్ బోనం కృష్ణసతీష్, యాళ్ల దొరబాబు విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.మహేశ్వర్, నెహ్రూ జిల్లా అధికారి దూలం కిశోర్, ఆకుల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై ఎమ్మెల్యే వేగుళ్ల సమీక్ష

మండపేట, డిసెంబరు, 12(ఆంధ్రజ్యోతి): మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు గురువారం విద్యుత్ ఉద్యోగులతో పార్టీ క్యాంపు కార్యాలయంలో సమీక్ష జరిపారు. వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకు నియోజకవర్గ పరిధిలో ప్రతి గ్రామానికి 24 గంటల విద్యుత్ అందించేలా చర్యలు తీసుకోవాలని వారిని ఆదేశించారు. ఎక్కడా లోవోల్టేజ్ మాట వినపడకూడదని, అవసరమైన మేరకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. సమీక్ష ముగిసిన అనంతరం విద్యుత్ శాఖ అధికారులు సిబ్బంది ఆయన్ను సత్కరించారు. సమావేశంలో విద్యుత్‌శాఖ డీఈ రత్నాలరావు, ఏడీఈలు మురళీధర్, శ్రీధర్, ఏఈలు మునిరవికుమార్, సాంబశివరావు, ఈశ్వరరావు, సురేష్, సబ్ ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


ఎమ్మెల్యే వేగుళ్లను సత్కరిస్తున్న విద్యుత్ ఉద్యోగులు


వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు చేస్తున్న దృశ్యం

వాడపల్లి ఆలయానికి భక్తుల తాకిడి

ఆత్రేయపురం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. స్వామివారికి అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.2,76,434 వచ్చినట్టు ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

ఘనంగా తిరునక్షత్ర ఉత్సవాలు: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలోనున్న ఆళ్వార్ సన్నిధిలో తిరునక్షత్ర పూజలు జరిపారు. గురువారం నాల్గవ రోజు ఆళ్వార్‌ను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి పూజలు జరిపారు. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య ప్రకారోత్సవం నిర్వహించి ద్రవిడ వేద పారాయణం చేశారు. ఆలయ ఉప కమిషనరు నల్లం సూర్య చక్రధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


ప్రత్యేక అలంకరణలో తిరుమంగయి ఆళ్వార్

సాగునీటి సంఘాల ఎన్నికలకు పూర్తయిన ఏర్పాట్లు


సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై సమీక్షిస్తున్న అధికారులు

ఆలమూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆలమూరు తహశీల్దార్ కెజె ప్రకాష్‌బాబు, ఎంపీడీవో ఏ.రాజు తెలిపారు. రేపు జరగనున్న నాలుగు నీటి సంఘాల ఎన్నికలకు 4 ప్రాంతాల్లో ఏర్పాటు చేశామన్నారు. గురువారం సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై మండల స్థాయి అధికారులతో సమీక్ష జరిపారు. మండలంలో నాలుగు నీటి సంఘాలు, ఒక డిసీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉందన్నారు. మడికి, చొప్పెల్ల, ఆలమూరు, చింతలూరు సాగునీటి సం ఘాలకు ఎన్నికలు జరుగుతున్నట్లు తెలిపారు. ఎన్నికలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లతో పాటు ఎన్నికల నిర్వహణ సిబ్బందిని నియమించామని తహశీల్దార్ ప్రకాష్‌బాబు, ఎంపీడీవో రాజు చెప్పారు. సమీక్షా సమావేశంలో ఇరిగేషన్ ఏఈ కృష్ణ త్రిమూర్తులు, ఆలమూరు మండల పరిషత్ ఏవో మెహర్ ప్రకాష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ పి.పద్మ, రావులపాలెం ఏవో బి.మీన, రావులపాలం ఎంపీపీ కార్యాలయం ఏవో మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికల నిర్వాహకులకు శిక్షణ ఇస్తున్న ఇరిగేషన్ డీఈ పోచారావు

ఎన్నికల నిర్వహణలో నిబంధనలు పాటించాలి

కె.గంగవరం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రేపు జరగనున్న నీటి సంఘాల ఎన్నికలను నిబంధనల ప్రకారం నిర్వహించాలని ఇరిగేషన్ డీఈ పోచారావు అన్నారు. గురువారం ఆయన వెలుగు కార్యాలయంలో నీటి సంఘాల ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. మండలంలో 7 నీటి సంఘాల్లో అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక చేయాల్సి ఉంది. దీనికోసం సచివాలయాల్లో పనిచేస్తున్న 84 మంది సిబ్బందిని నియమించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ సుబ్రహ్మణ్యం, డిప్యూటీ తహశీల్దార్ శ్రీరామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

రాష్ట్ర పండుగలా గోదావరి ట్రోఫీ పోటీలు నిర్వహించాలి

ఆత్రేయపురం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. లొల్ల లాకుల వద్ద సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ పోటీలు పండుగలా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం లొల్లలాకుల వద్ద ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశం జరిపారు. సంక్రాంతి కంటే ముందుగానే లొల్లలాకుల వద్ద కేరళస్థాయిలో పడవ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. బయట ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులను ఆకట్టుకునేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తద్వారా లొల్లలాకులను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు కరుటూరి నరసింహారావు, ముళ్ళపూడి భాస్కరరావు, తోటకూర సుబ్బరాజు, ఎంపీడీవో వెంకటరామన్, తహశీల్దారు రాజేశ్వరరావు, సీఐ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.


డాక్టరేట్ అందుకుంటున్న సూర్యనారాయణ శర్మ

పెండ్యాలకు డాక్టరేట్

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురానికి చెందిన జ్యోతిష్కుడు పెండ్యాల సూర్యనారాయణ శర్మకు తిరుపతిలో డాక్టరేట్ ప్రదానం చేశారు. మెడికల్ ఆస్ట్రాలజీలో పరిశోధన జరిపినందుకు బెంగళూరుకు చెందిన ఎస్‌వీవీ యూనిర్సిటీ తిరుపతి మహతి ఆడిటోరియంలో జరిగిన స్నాతకోత్సవంలో ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేశారు. డాక్టరేట్ అందుకున్న ఆయన్ను పలువురు అభినందించారు.

'విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో బోధన చేయాలి'

కె.గంగవరం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో ఉపాధ్యాయులు బోధన చేయాలని ఎంఈవో ఏ.నాగరాజు అన్నారు. గురువారం కె.గంగవరం ఉన్నత పాఠశాలలో ఆయన విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను ఎంఈవో పరిశీలించారు.

పంట కాలువలో తుప్పలు, వ్యర్థాలు

• పట్టించుకోని కాంట్రాక్టర్ • పనులు చేయకుండా బిల్లుల కోసం పైరవీలు

కొత్తపేట, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పలివెల-అమలాపురం ప్రధాన పంటకాలువలో తుప్పలు, వ్యర్థాలు పెరిగిపోయి ప్రవాహానికి అడ్డు వస్తున్నా సంబంధిత కాంట్రాక్టరు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. గోదావరి సెంట్రల్ డివిజన్ పరిధిలో పలివెల- అమలాపురం ప్రధాన పంటకాలువలో ప్రవాహానికి అడ్డుగా ఉన్న వీటిని తొలగించేందుకు 2024-25 సంవత్సరానికి సంబంధించి ఖరీఫ్, రబీ పంటలు ముగిసే వరకు కాలువలో చెత్త తొలగింపు పనులు చేయాల్సి ఉంది. దీనికి సంబంధించి మార్చిలో ఆయా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తారు. పూర్తి కాలం అయ్యే వరకు అరకొర పనులు చేసి చేతులు దులుపుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. పంట కాలువలో నిత్యం వ్యర్థాలు, గుర్రపుడెక్క, తూడు పెరిగిపోయి ప్రవాహానికి అడ్డు తగులుతున్నప్పటికి ఇరిగేషన్ అధికారులు, చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ కాలం పూర్తవగానే బిల్లుల కోసం పైరవీలు చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంలో అధికారులు, కాంట్రాక్టర్లు, పలువురు రాజకీయ నాయకులు భాగస్వాములు అవుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కాలువలో పేరుకుపోయిన చెత్త, తూడును తొలగించి రైతులకు సక్రమంగా సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పలివెల-అమలాపురం ప్రధాన పంటకాలువలో పేరుకుపోయిన తుప్పలు, వ్యర్థాలు. పక్క చిత్రంలో తొలగింపు పనులకు కాంట్రాక్టు తీసుకున్న అగ్రిమెంట్


మండపేట మండలం వెలగతోడు రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహశీల్దార్ తేజేశ్వరరావు



ద్రాక్షారామ మండలం నరసాపురపుపేట సదస్సులో పాల్గొన్న దేవదాయశాఖ జిల్లా అధికారి తదితరులు

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

మండపేట, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండపేట తహశీల్దార్ తేజేశ్వరరావు సూచించారు. మండపేట మండలం వెలగతోడు, మెర్నిపాడు గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులు జరిపారు. గ్రామసభల్లో ప్రత్యేక అధికారి రామకృష్ణ, దేవదాయ శాఖ మండల అధికారి కామేశ్వరరావు, మండల సర్వేయర్ సుజాత, ఆర్ఐ వాసంతి, పంచాయతీ కార్యదర్శి వర్మ తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం: ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ బండి మృత్యుంజయరావు అన్నారు. గురువారం మండలంలోని శివల, గుడిగళ్ళభాగ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరిపారు. తొలుత ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేశారు. అనంతరం జరిగిన సభలో ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మురళి, ఆర్ఐ వెంకట్రావు, సర్వేయర్ బృందం, పలువురు రైతులు పాల్గొన్నారు.

రావులపాలెం: రావులపాలెం మండలం ముమ్మిడివరప్పాడులో గురువారం రెవెన్యూ సదస్సు జరిపారు. ఇన్‌చార్జ్ తహశీల్దారు ఎస్.శ్రీనివాసరావు, మండల సర్వేయర్ రవిశంకర్, ఆర్ఐ సుజాత అర్జీలు తీసుకున్నారు. రైతులు మాట్లాడుతూ పండించిన పంటను అమ్ముకుందామంటే టార్గెట్ లేదంటున్నారని ఆరోపించారు. మిల్లుకు నేరుగా అమ్ముదామంటే తక్కువ ధరకు అడుగు తున్నారని వాపోయారు. దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు అధికారులను కోరారు.

ద్రాక్షారామ: రామచంద్రపురం మండలం నరసాపురపుపేటలో గురువారం రెవెన్యూ సదస్సు జరిపారు. సదస్సులో జిల్లా దేవదాయశాఖ అధికారి సత్యనారాయణ, తహశీల్దార్ సావిత్రి, మండల ప్రత్యేకాధికారి ఎం.శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. రైతుల నుంచి వినతి పత్రాలు తీసుకున్నారు.

కపిలేశ్వరపురం: రెవెన్యూ సదస్సులను ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ పి.చిన్నారావు అన్నారు. గురువారం నేలటూరులో సర్పంచ్ కె.వీరన్న అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, డీఎల్‌డీవో కామేశ్వరరావు, ఆర్ఐ అర్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: రెవెన్యూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని ప్రత్యేకాధికారి రామారావు అన్నారు. గురువారం వద్దిపర్రులో రెవెన్యూ సదస్సు జరిపారు. కార్యక్రమంలో తహశీల్దారు రాజేశ్వరరావు, రిజిస్ట్రార్ రత్నకుమార్, సర్పంచ్ జుజ్జవరపు శ్యామల హరిబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



కె.గంగవరం మండలం గుడిగళ్ళభాగలో రెవెన్యూ సదస్సులపై ర్యాలీ


కపిలేశ్వరపురం మండలం నేలటూరు రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహశీల్దార్ చిన్నారావు

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

మండపేట, డిసెంబరు, 12(ఆంధ్రజ్యోతి) ద్వారపూడికి చెందిన యువతి గతనెల 21న అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసి ంది. బాధిత యువతి తల్లి గతనెల 20న కనిపించకుండా పోయిందని నవంబరు 21న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అమె ఫిర్యాదుపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. అదృశ్యమైన యువతిని రాయవరం మండలం మాచవరానికి చెందిన వ్యక్తి తీసుకు వెళ్లి ఉండవచ్చని యువతి తల్లి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఆమె ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు కేసు ఛేదించారని సమాచారం. ద్వారపూడికి చెందిన యువతి, మాచవరానికి చెందిన యువకుడు హైదరాబాద్‌లో వున్నారన్న సమాచారం తెలుసుకున్న పోలీసులు ఈనెల 12న వారిని అదుపులోకి తీసుకుని గురువారం ద్వారపూడికి పోలీసులు తీసుకువచ్చారని తెలిసింది. ఈ కేసు విషయంలో పోలీసులు గోప్యత పాటిం చడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. యువతి అదృశ్యంపై దర్యాప్తు జరుగుతోందని పోలీసులు చెప్పటం కొసమెరుపు.


మండపేట సీతారామ క్షేత్రంలో జరుగుతున్న సప్తాహం

శ్రీసీతారామ క్షేత్రంలో కొనసాగుతున్న ఏకాహం

మండపేట, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బూరుగుంట సీతారామ క్షేత్రంలో నాల్గోరోజు కూడా ఘనంగా ఏకాహం జరిగింది. వారం రోజులపాటు జరిగే ఏకాహం 9న ప్రారంభమైంది. గురువారం సీతారామచంద్రులకు స్వర్ణ పుష్పార్చన పూజా జరిగింది. పట్టణానికి చెందిన మల్లిపూడి వేంకటేశ్వరరావు, మల్లిపూడి గణేష్ సహకారంతో 17 వరకు సప్తాహం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. హనుమత్ వ్రతాన్ని పురస్కరించుకుని 9 రోజుల పాటు ఏకాహం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు చెప్పారు. ఏకాహంలో పాల్గొన్న వారికి మల్లిపూడి కుటుంబీకులు భోజన వసతి కల్పించారు. శుక్రవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, హనుమాన్ వ్రతాలు నిర్వహిస్తున్నా మని నిర్వాహకులు తెలిపారు.


పొడగట్లపల్లిలో దగ్ధమవుతున్న గడ్డి ట్రాక్టర్

గడ్డి ట్రాక్టర్ దగ్ధం

రావులపాలెం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎండుగడ్డి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌కు విద్యుత్ వైర్లు తగలడంతో షార్ట్‌సర్క్యూట్ మంటలు చేలరేగిన సంఘటన జరిగింది. రావులపాలెం మండలం పొడగట్లపల్లి అగ్రహారానికి చెందిన కొండిపర్తి బూరయ్య రెండు ఎకరాలలోని ఎండుగడ్డిని ట్రాక్టర్‌పై లోడు చేసి తరలించుకుంటున్నాడు. దీంతో ట్రాక్టర్‌పై ఉన్న గడ్డికి విద్యుత్ వైర్లు తగలడంతో మంటలు చేలరేగి గడ్డి దగ్ధమైంది. గడ్డితో పాటుగా ట్రాక్టర్ కూడా పాక్షికంగా దగ్ధమైంది. అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు.

రైతులు తరలి రావాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు రైతులంతా అమలాపురం తరలిరావాలని రామచంద్రపురం నియోజకవర్గ వైసీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ కోరారు. శుక్రవారం ఉదయం రామచంద్రపురం వైసీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లనున్నట్టు తెలిపారు.

టీడీపీ సభ్యత్వంతో కుటుంబానికి మంచి భవిష్యత్

కె.గంగవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతీ కుటుంబానికి టీడీపీ సభ్యత్వం ఉంటే ఆ కుటుంబానికి మంచి భవిష్యత్ ఉంటుందని టీడీపీ నాయకుడు రాయపురెడ్డి విశ్వేశ్వర సీతారామయ్య అన్నారు. గురువారం యర్రపోతవరం గ్రామంలో టీడీపీ సభ్యత్వ నమోదును ఆయన ఆధ్వర్యంలో జరిపారు. టీడీపీ సభ్యత్వం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించి ప్రజలతో టీడీపీ సభ్యత్వ నమోదు చేయించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సాపిరెడ్డి దొరబాబు, సత్యనారాయణ, చంటి, వాంసశెట్టి సత్తిబాబు, దండు పెద్దింట్లు తదితరులు పాల్గొన్నారు.


టీడీపీ సభ్యత్వం నమోదు చేస్తున్న దృశ్యం

దివ్యాంగులకు సహకరించిన దాతలకు సత్కారం

ఆత్రేయపురం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో వారిని ప్రోత్సహించిన దాతలను గురువారం సత్కరించారు. మండల పరిషత్ కార్యాలయంలో పీబీవీ కిరణ్‌కుమార్ మిత్ర బృందం రూ.50వేలు, నరేష్ రూ.20వేలు, ధర్మారెడ్డి ఫుడ్ డోనర్, ఎంఈవో-2 రూ.5వేలు, లొల్ల హైస్కూల్ హెచ్‌ఎం రూ.5 వేలు భవిత కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగుల దినోత్సవానికి దాతలు విరాళాలు అందించి ప్రోత్సహించారు. విరాళం అందించిన భవిత టీచర్ అరుణ, ఆమె భర్త కిరణ్‌కుమార్‌ను సత్కరించారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, ఎంపీడీవో వెంకటరామన్, ఎంఈవోలు వరప్రసాద్, సాహెబ్‌లు దాతలను సత్కరించారు.


దాతలను సత్కరిస్తున్న దృశ్యం


ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామివారు

నేడు ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమాన్ వ్రతాలు

మండపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమాన్ వ్రతాలను శుక్రవారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. పట్టణంలో వందేళ్ల చరిత్ర కలిగిన పురాతన ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి హనుమత్ వ్రతాలు, తమలపాకులు, సిందూర అభిషేకాలను నిర్వహిస్తున్నామని ఆలయ అర్చకుడు ఖండవల్లి పవన్ కుమార్ తెలిపారు. పట్టణంలో రథంగుడి, ధర్మగుండం చెరువు, నాలుగు గుళ్ల రామాలయం, గొల్లలగుంట రామాలయం, గొల్లపుంత కాలనీ రోడ్డులో రామాలయం, మండపేట మండలంలో కేశవరం, ద్వారపూడి, పాలతోడు, వెలగతోడు, మెర్నిపాడు, మారేడుబాక, తాపేశ్వరం, ఏడిద, వై.సీతానగరం తదితర గ్రామాల్లో కూడా హనుమత్ వ్రతాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు.


ద్వారపూడిలో పునఃప్రతిష్ఠించిన గనిపోతురాజు స్వామివారు

వైభవంగా విగ్రహ పునఃప్రతిష్ఠ

మండపేట, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ద్వారపూడి గ్రామంలో గనిపోతురాజుస్వామి విగ్రహం పునఃప్రతిష్ఠ బుధవారం జరిగింది. ప్రత్యేక అతిథిగా ద్వారపూడి ఆంధ్ర శబరిమలై అయ్యప్పస్వామి ఆలయ ట్రస్టీ ఎస్ఎల్ కనకరాజు గురుస్వామి చేతుల మీదుగా జరిగింది బుధవారం స్వామివారికి గ్రామోత్సవం, ప్రత్యేక పూజల అనంతరం గురువారం ప్రతిష్ఠ కార్యక్రమాన్ని అర్చకుడు సత్యవాడ వెంకట రమణశర్మ ఆధ్వర్యంలో జరిగింది. స్వామివారికి పునఃప్రతిష్ఠను పురస్కరించుకుని అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం

రావులపాలెం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): లక్ష్మీపోలవరంలో జిల్లా పశుగణాభివృద్ధి ఆధ్వర్యంలో ఉచిత పశు గర్భకోశ వ్యాధి నివారణ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఏరియా వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఎస్.ఉమామహేశ్వరరెడ్డి ప్రారంభించారు. శిబిరంలో మండల పశువైద్యాధికారి ఎం.సోమేశ్వర రెడ్డి, పశువైద్యాధికారి ఎం.సాయిబాస్కర్, డాక్టర్ నితీష గ్రామంలోని 52 పశువులకు పరీక్షలు జరిపి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ రామారావు, ఏహెచ్‌ఏలు ప్రభాకర్, షాజహాన్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మండపేట, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ డీఈ కె.రత్నాలరావు తెలిపారు. పట్టణంలోని గొల్లపుంత కాలనీ, కృష్ణకల్యాణి లేఅవుట్, రావులపేట, పెద్ద గొల్లపుంత, మరంవీధి, ఆలమూరు రోడ్డు పరిసర ప్రాంతాల్లో కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఒక ప్రకటనలో కోరారు.

డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా

రావులపాలెం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జేకేసీ కోఆర్డినేటర్ కె.రజని ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఇండో ఐబిఎం, పానాసోనిక్, కేబిఎంఎల్, హోండై మోబిస్, ఇన్ఫో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఇండోస్ కాఫీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఇంటర్వ్యూల్లో 137 మంది అభ్యర్థులు పాల్గొనగా ఇంటర్వ్యూ వెరిఫికేషన్ పూర్తయిన తరువాత 25 మంది అభ్యర్థులు ఉద్యోగావకాశాలు పొందినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు.